ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
5
శుక్రవారం 19, జనవరి 2024



కొండపిలో ఎన్టీఆర్, ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సత్య

# మనసా స్మరామి

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఊరూవాడా వర్ధంతి కార్యక్రమాలు
పలుచోట్ల భారీగా అన్నదానాలు, రక్తదాన శిబిరాలు
ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు, ముఖ్యనేతలు



ఒంగోలులో రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జనార్దన్, బాలాజీ, మంత్రి శ్రీను

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావును జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా స్మరించుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీఎత్తున అన్నదానాలు, రక్తదానాలు, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు. అన్న ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు గురువారం అన్ని నియోజకవర్గాల్లో పెద్దఎత్తున జరిగాయి. ఊరూవాడా టీడీపీ శ్రేణులు, అభిమానులు భారీగా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య నేతలు, తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను కీర్తించారు. పేదల గుండెల్లో ఆయన ఎప్పటికీ చిరస్మరణీయుడిగా ఉంటారని అన్నారు.



వైపాలెంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు



ముండ్లపాడులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అశోక్‌రెడ్డి



కనిగిరిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఉగ్ర, టీడీపీ నేతలు

ఒంగోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా గురువారం పెద్దఎత్తున జరిగాయి. ఏటా టీడీపీ శ్రేణులు భారీగా నిర్వహిస్తున్నా త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి మరింత జోరు కనిపించింది. ఆయా ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు పలు ప్రాంతాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్‌లు తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు బహిరంగ సభ నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లలో ఉన్నారు. దీంతో వారు గురువారం తిరుపతిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి హారతి ఇచ్చి నివాళులర్పించారు. ఇక జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పరిశీలిస్తే.. ఒంగోలులోని పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం, సభతోపాటు దాదాపు పదికిపైగా ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ తొలుత దామచర్ల జనార్దన్‌తో కలిసి ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండపి నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన టంగుటూరు సింగరాయకొండ, కొండపితోపాటు పలు గ్రామాల్లో టీడీపీ యువనేత దామచర్ల సత్య నేతృత్వంలో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కనిగిరితోపాటు మండల కేంద్రాలైన వెలిగండ్ల, సీఎస్ పురం, ఇతర పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. దర్శి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, గోరంట్ల రవికుమార్ పాల్గొన్నారు. వైపాలెంతోపాటు పలు ఇతర చోట్ల ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు, కంభంలోనూ, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురంలోనూ పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.



మార్కాపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కందుల, టీడీపీ నేతలు



మద్దిపాడులో రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న బీఎన్ విజయకుమార్

# బుర్రా అవుట్

» కనిగిరి నుంచి దద్దాలకు అవకాశం » మార్కాపురంలో పోటీ చేయలేమన్న శిద్దా » జంకెకు డబ్బులే సమస్య
» అక్కడ నాగార్జునరెడ్డికే చాన్స్ » కందుకూరు విషయంలో సందిగ్ధం » మహీధర్‌రెడ్డి వైపే మొగ్గు
» గిద్దలూరుకు స్థానిక నేతపై దృష్టి » ఎంపీగా సత్యనారాయణరెడ్డి పేరు పరిశీలన » ఒంగోలు సీటు బాలినేనికే.. 22న ర్యాలీ


ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీలో అభ్యర్థుల ఎంపిక వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను పక్కన పెట్టేశారు. ఆయన స్థానంలో అసమ్మతి నేత, హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణయాదవ్‌కు అవకాశం ఇచ్చారు. మరికొన్ని మార్పులు, చేర్పులపై పరిశీలన అనంతరం మార్కాపురం, కందుకూరుల్లో సిటింగ్ ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డిలకు అవకాశాలు మెరుగుపడ్డాయి. భూసేకరణకు అవసరమైన నిధులు రాబట్టుకున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి తిరిగి ఒంగోలులో పోటీకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. గిద్దలూరులో రెడ్డి సామాజికవర్గానికి చెందిన స్థానిక నేతకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ స్థానానికి ఎంపీ మాగుంటను కాదనుకున్న జగన్.. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకున్నారు. శుక్ర, శనివారాల్లో తుది జాబితా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

### బుర్రాకు నోచాన్స్

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌కు టికెట్ ఖాయమని నిన్న మొన్నటివరకూ చెప్పిన జగన్ గురువారం సాయంత్రం నిర్ణయాన్ని మార్చుకున్నారు. తొలుత బుర్రాతో మాట్లాడిన సీఎం.. 'మీకు నియోజకవర్గంలో అసమ్మతినేతలు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. తాజా సర్వే నివేదికలు కూడా మీకు వ్యతిరేకంగా వచ్చాయి. అందువల్ల మిమ్మల్ని తప్పించక తప్పడం లేదు' అని చెప్పినట్లు తెలిసింది. వెంటనే బుర్రా కన్నీళ్లు పెట్టుకొని ఏదో చెప్పుకోబోగా వేచి ఉండండి ఇతరత్రా అవకాశాలు చూస్తామని చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్యే బుర్రా వ్యతిరేకవర్గంలో ఉన్న దద్దాల నారాయణయాదవ్‌ను పిలిచి వెళ్లి పనిచేసుకోండని ఆదేశించారు. ఆమేరకు నారాయణ పేరును కనిగిరి ఇన్‌చార్జిగా గురువారం రాత్రి మంత్రి బొత్స ప్రకటించారు.

తొలుత బుర్రాతో జగన్ మాట్లాడిన సమయంలో కందుకూరు లేక మరో నియోజకవర్గానికి వెళ్తారా? అని అడిగితే ఆయన ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు బుర్రా వియ్యంకుడైన కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని కూడా ఇటీవల పెనమలూరు నుంచి జగన్ తప్పించిన విషయం తెలిసిందే. ఆయన టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కనిగిరి నుంచి బుర్రాను తప్పించడం పలురకాల అనుమానాలకు తెరలేపింది. ప్రస్తుతం కనిగిరి అభ్యర్థిగా ఎంపికైన నారాయణయాదవ్ 2019లో వైసీపీలో చేరి స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం వరకు బుర్రాతో కలిసి ఉన్నారు. వ్యాపారవేత్త అయిన నారాయణయాదవ్‌కు, బుర్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారపరమైన సమస్యలతో మనస్పర్థలు వచ్చి దూరమయ్యారు. అప్పటి నుంచి ఆయన ఎమ్మెల్యే బుర్రా వ్యతిరేకవర్గంతో కలిసి పయనించారు.



### గిద్దలూరుపై సస్పెన్స్


గిద్దలూరు అభ్యర్థి ఎంపికపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బాలినేని ఒంగోలు నుంచే తిరిగి పోటీచేయటం ఖాయమవడంతో అక్కడ రెడ్డి సామాజికవర్గానికి చెందిన మరో నాయకుడిని రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితర కొన్ని పేర్లు పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. అయితే రెడ్డి సామాజికవర్గంలోనే స్థానికుడికి అవకాశం ఇవ్వాలన్న భావనకు వచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే రాంబాబుపై అసమ్మతిబావుటా ఎగురవేసిన రమణారెడ్డితోపాటు మరో ఒకరిద్దరి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### మహీధర్‌రెడ్డితో భేటీ

కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఒకదశలో కందుకూరు నుంచి బొట్ల రామారావు పేరును పరిశీలనలోకి తీసుకున్న జగన్ తాజాగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రాను కందుకూరుకు మార్చాలని భావించారు. బుర్రా అందుకు సిద్ధపడకపోగా, మహీధర్‌రెడ్డికోసం నెల్లూరు ఎంపీగా పోటీచేయబోతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గట్టిగా పట్టుబట్టినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మహీధర్‌రెడ్డితో సీఎం.. 'పరిస్థితులు ఎలా ఉన్నాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ ఆలోచనా ధోరణిపై మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగినట్లు తెలిసింది. ఆతర్వాత రెండురోజుల్లో సముచిత నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు సమాచారం. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా అభ్యంతరం లేదని మహీధర్‌రెడ్డి కూడా సూటిగానే ఆయనతో చెప్పారు. అయితే మానుగుంట వైపే జగన్ మొగ్గుచూపుతున్నట్లు చెబుతున్నారు.







వరుసగా దద్దాల నారాయణ, నాగార్జునరెడ్డి, మహీధర్‌రెడ్డి

### ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా సత్యనారాయణరెడ్డి పేరు పరిశీలన

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని పక్కనపెట్టిన జగన్.. రెడ్డి సామాజికవర్గం వారికే అవకాశం ఇవ్వాలన్న తన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీచేయాలని ఆశించినప్పటికీ స్థానిక నాయకుల నుంచి సానుకూలత రాలేదని సమాచారం. దీంతో కనిగిరికి చెందిన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం.

### ఒంగోలు నుంచే బాలినేని

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అడిగిన నివేశన స్థలాలకు అవసరమైన భూసేకరణ కోసం రూ.180 కోట్ల విడుదలకు గురువారం మధ్యాహ్నం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. బుధవారం సాయంత్రమే మౌలిక సదుపాయాల కల్పనకు రూ.21 కోట్లను కలెక్టర్ మంజూరు చేశారు. దీంతో తాను ఒంగోలులోనే పోటీచేస్తానని సీఎం జగన్‌కు బాలినేని చెప్పినట్లు తెలిసింది. ఆమేరకు సోమవారం ఒంగోలులో పేదలపక్షపాతి బాలినేని అనే పేరుతో ర్యాలీ నిర్వహణకు ఆయన అనుచరులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లిన బాలినేని సోమవారం ఒంగోలు రానున్నారు.

### మార్కాపురం నుంచి నాగార్జునరెడ్డికే అవకాశం

వివిధ రకాల పరిణామాల అనంతరం మార్కాపురం టికెట్‌ను తిరిగి సిటింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికే ఖరారు చేసినట్లు తెలిసింది. తొలుత మాజీ ఎమ్మెల్యే జంకె పేరును పరిశీలించినప్పటికీ ఆయన ఆర్థికంగా తూగలేరని తెలిశాక పక్కనబెట్టారు. బుధవారం భేటీలో బాలినేని.. మార్కాపురం నుంచి మాజీమంత్రి శిద్దా రాఘవరావు లేక ఆయన కుమారుడు సుధీర్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం జగన్ అంగీకరించడంతో సుధీర్‌ను బాలినేని విజయవాడ పిలిపించుకుని మాట్లాడారు. దర్శి మినహా ఎక్కడా పోటీచేయలేమని సుధీర్ తేల్చిచెప్పి సీఎం వద్దకు వెళ్లకుండానే వెనక్కు వచ్చేశారు. ఈ విషయమై జగన్‌కు బాలినేని సమాచారం పంపారు. గురువారం సాయంత్రం నాగార్జునరెడ్డి సీఎం జగన్‌ను కలవగా 'మీరు జాగ్రత్తగా పనిచేసుకోండి. అందర్నీ కలుపుకుపోండి. ముఖ్యంగా జంకె వెంకటరెడ్డితో కలిసి నడవాల్సిందే' అని చెప్పినట్లు తెలిసింది. నాగార్జునరెడ్డి కూడా తాను స్వయంగా వెళ్లి ఆయన్ను కలుస్తానని చెప్పి వచ్చారు. దీంతో నాగార్జునరెడ్డికి అవకాశాలు తిరిగి మెరుగుపడ్డాయి

# అవ్వకు పింఛన్

**'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన**



వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంజాయిషీ అడుగుతున్న ఎంపీడీవో ప్రసాద్

కంభం, జనవరి 18 : కంభానికి చెందిన కమల అనే వృద్ధురాలికి ఎట్టకేలకు పింఛన్ అందింది. వలంటీర్ గురువారం ఆమె ఇంటికి వెళ్లి రూ.3వేలు అందజేశారు. కంభం పంచాయతీ పరిధిలోని మేదరవీధిలో నివసించే తరిట కమల వృద్ధురాలు. ఆమె భర్త ఎనిమిది నెలల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి కమల తనకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. ఈ విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'అవ్వకు అవస్థ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో ప్రసాద్.. వలంటీర్‌ను, వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కార్యాలయానికి పిలిపించి సంజాయిషీ కోరారు. నూతన పింఛన్‌ల లిస్టులో వృద్ధురాలి పేరు ఉన్నట్లు వారు తెలిపారు. వలంటీర్ కుటుంబసభ్యులకు ఆరోగ్యం సరిగాలేక హైదరాబాద్ వెళ్లడంతో కమలకు సకాలంలో పింఛన్ ఇవ్వలేకపోయామన్నారు. ఆవెంటనే ఎంపీడీవో ఆదేశాల మేరకు వృద్ధురాలు కమల ఇంటికి వలంటీర్ వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశారు.

# నేటి నుంచి కులగణన

**తహసీల్దార్లు, ఎంపీడీవోల నేతృత్వంలో ఏర్పాట్లు**

**వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సర్వే**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18 : జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి కులగణన ప్రారంభంకానుంది. అన్ని గ్రామాల్లోనూ కార్యక్రమ నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సచివాలయం యూనిట్‌గా సర్వే జరగనుంది. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు శుక్రవారం నుంచి ఈనెల 28వతేదీ వరకు ఇంటింటికీ తిరిగి కులాల వారీగా సమాచారాన్ని సేకరించనున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ముందుగా ఈసర్వే చేస్తారు. తమ పరిధిలో ఉన్న 50 కుటుంబాల వివరాలను వలంటీర్లు సేకరించిన అనంతరం సచివాలయ సిబ్బంది ఒక్కో గృహాన్ని సందర్శించి మరోసారి పరిశీలిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగనుంది. ఒక మండలంలో ఉన్న గ్రామ పంచాయతీల్లో సగం తహసీల్దార్లు, మరో సగం ఎంపీడీవోలకు కేటాయించారు. కులగణన సర్వే పరిశీలనకు సూపర్‌వైజర్లతోపాటు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఈనెల 28వతేదీ నాటికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే చేసేలా చర్యలు తీసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆయా గృహాలకు వచ్చిన సమయంలో యజమానులు అందుబాటులో లేకపోతే తిరిగి ఈనెల 29వతేదీ నుంచి వచ్చేనెల 2వతేదీలోపు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కులగణన నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

# అర్హులందరికీ సొంత ఇళ్లు

**కలెక్టర్ దినేష్‌కుమార్**

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 18 : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. అందుకోసం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని త్వరగా నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ సందర్భంగా గురువారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకాశంభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 39,541 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35వేల చొప్పున రూ.139.30 కోట్ల మేర రుణాలను అందించినట్లు తెలిపారు. వీరిలో ప్రస్తుతం 11,141 మంది లబ్ధిదారులకు తొలి విడత రూ.1.18 కోట్ల వడ్డీ రీయింబర్స్ చేస్తున్నట్లు తెలిపారు. ఇలా సంవత్సరంలో రెండుసార్లు ఇస్తామన్నారు. జిల్లాలో 74వేల గృహాలను మంజూరు చేయగా, వాటిలో ఇప్పటి వరకు 24వేల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పేరయ్య, మెప్మా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

# అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

**రేపు రాస్తారోకోకు కార్మిక, ప్రజా సంఘాల పిలుపు**



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 18 : అంగన్‌వాడీల ఆందోళన మరింత ఉధృతమవుతోంది. 38 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. అదేసమయంలో కార్యకర్తలు, ఆయాలకు మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నాయి. శనివారం పెద్దఎత్తున రాస్తారోకోలకు పిలుపునిచ్చాయి. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ తదితరులు ఈ విషయాన్ని వెల్లడించారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ఎస్మాను ప్రయోగించడం పాలకుల నిరంకుశ ధోరణికి అద్దం పడుతున్నదన్నారు. దీన్ని ఖండిస్తూ ఆందోళనను ఉధృతం చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీలకు అండగా శనివారం జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు చేపడుతున్నట్లు చెప్పారు. పలు ప్రజాసంఘాలు కూడా కార్యక్రమంలో పాల్గొంటాయని వారు తెలిపారు. మరోవైపు అంగన్‌వాడీలు చేస్తున్న 24గంటల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. రాత్రి వేళల్లో కార్యకర్తలు, ఆయాలు శిబిరాల్లోనే నిద్రిస్తున్నారు. శుక్రవారం విజయవాడలో జరగనున్న ధర్నాకు జిల్లా నుంచి ఎవరూ వెళ్లకుండా పోలీసులు నిర్బంధం విధించారు. కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. పలువురిపై నిఘా ఉంచారు.

# సంక్రాంతి సెలవులు 2 రోజులు పొడిగింపు

**22 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం**

ఒంగోలు (విద్య), జనవరి 18 : పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించింది. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. అన్ని యాజమాన్యాల్లో నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తొలుత ఈనెల 9 నుంచి 18వతేదీ వరకూ పండుగ సెలవులు ప్రకటించారు. అయితే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈనెల 19, 20 తేదీల్లో కూడా సెలవులు ఇచ్చారు. 21న ఆదివారం కావడంతో స్కూళ్లు ఈనెల 22నుంచి పునఃప్రారంభమవుతాయి.



# బస్సులన్నీ బెజవాడకే..!

**ప్రయాణికులకు తప్పని తిప్పలు**

**అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో పాల్గొనాలని పొదుపు మహిళలపై ఒత్తిడి**

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 18 : విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు ప్రభుత్వం చేస్తున్న హడావుడి జిల్లాలోని ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టింది. ఆర్భాటం కోసం ఈ కార్యక్రమానికి ప్రజలను తరలించడానికి 200కుపైగా ఆర్టీసీ బస్సులను కేటాయించింది. దీంతో అరకొరగా ఉన్న బస్సులతో ప్రయాణికులు తమ ఊర్లకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. గంటల తరబడి ఆర్టీసీ బస్టాండ్లలో ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. నగరంలోని ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన బస్సులన్నింటినీ పంపాలని యాజమాన్యాలకు ఆదేశాలు అందాయి. మరోవైపు పొదుపు సభ్యులంతా విజయవాడకు తరలిరావాల్సిందేనని అధికారులు హుకుం జారీ చేశారు. దీనిపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు.


కమ్మపాలెంలో మహిళలతో కలిసి దామచర్ల జనార్దన్ నివాళులు


అద్దంకి బస్టాండు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దామచర్ల, నూకసాని


త్రోవగుంటలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

# తెలుగు జాతి ఖ్యాతిని చాటిన మహనీయుడు ఎన్టీఆర్

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల
- నందమూరి తారకరామారావుకు ఘన నివాళి
- రక్తదాన శిబిరాలు, అన్నదానం చేసిన శ్రేణులు
- పలుచోట్ల భారీగా వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 18: అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత, యుగపురుషుడు, తెలుగు ప్రజల కీర్తిన చాటిన మహానాయకుడు స్వర్గీయ నందమరి తారకరామారావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని ఒంగోలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్షుల కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షత జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైనదామచర్ల మాట్లాడుతూ ప్రపంచానికి తెలుగు ప్రజల కీర్తిని చాటడమే కాకుండా సినీనటుడుగా, రాజకీయనాయకుడుగా ఎన్టీఆర్ అన్నీ వర్గాల ప్రజల కోసం అహర్నిలు కృషి చేశారని కొనియాడారు. ఆనాడే మహిళలకు ఆస్తి సమానం హక్కు, కిలో బియ్యం రూ.2లకు, జనతా వస్త్రాలు, ఎస్సీ కాలనీల్లో పక్కా గృహాలు, రహదారుల నిర్మాణం, మండల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. రవ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యరంగాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించే దిశగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేశారన్నారు. రాష్ట్ర పునర్విభజనతో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అన్నీ వర్గాల వారికి అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో నాడు ముఖ్యమంత్రి హోదాలో ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూతనిచ్చిన ఘనత చంద్రబాబుదే అని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. వృద్ధులకు పెన్షన్లు పెంపు, మహిళా సాధికారత, రైతు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ పేద, బడుగు వలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీని స్థాపించడమే కాకుండా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఒంగోలు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలూరి వెంకటేశ్వరరెడ్డి, వైవీ.సుబ్బారావు, గోరంట్ల రవికుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి నాళం నరసమ్మ, రాష్ట్ర కార్యదర్శి కామరాజుగడ్డ కుసుమకుమారి, ఒంగోలు పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు రావుల పద్మజ, ప్రధాన కార్యదర్శి బీరం అరుణ, పసుపులేటి సునీత, ఎన్టీఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 200 మంది రక్తాన్ని దానం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు ఘనంగా నివాళుర్పించారు. అనంతరం భారీగా అన్నదానం చేశారు.


చెన్నకేశవ స్వామి లేఅవుట్ పార్కులో..


6వ డివిజన్‌లో కొఠారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో..


క్లౌపేటలో తెలుగుతమ్ముళ్ళ నివాళి


మద్దిపాడులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న బీఎస్, జయంత్‌బాబు తదితరులు



సంతనూతలపాడులో నాయకుల నివాళి, సరుకుల పంపిణీ


చీమకుర్తిలో విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన కుటుంబాలు

**చెన్నకేశవ లే అవుట్ పార్కులో..**

స్థానిక చెన్నకేశవస్వామి లే అవుట్ వాకర్స్ అసోయేషన్, ఎన్టీఆర్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్కులో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్, మాజీ ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్, మంత్రి శ్రీనివాసరావు, అభిమానులు చెన్నుపాటి వరప్రసాద్, కుర్రా భాస్కర్‌రావు, గణపతి మాస్టర్, ఆవుల ప్రసాద్, చెన్నకేశవస్వామి వాకర్స్, గుడ్‌మార్నింగ్ ఫ్రెండ్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో సుమారు 4వేల మందికి అన్నదానం చేశారు. వాకర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దామచర్ల ప్రారంభించారు.

**పలు సేవా కార్యక్రమాలు**

తూర్పు కమ్మపాలెంలో టీడీపీ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య, 6వ డివిజన్‌లో కొఠారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, అలాగే క్లౌపేట, శివాలయం సెంటర్, రాజపానగల్ రోడ్డు, అంజయ్యరోడ్ ఎన్టీఆర్ విగ్రహం, పై ఓవర్ బ్రిడ్జి వద్ద, ఆర్టీసీ డిపో ఎదురు ఎన్టీఆర్ విగ్రహం, అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా జరిగింది.

**రక్తదాన శిబిరానికి విశేష స్పందన**

ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని దామచర్ల జనారదన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్నదానం ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన వారిని నేతలు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

**ఒంగోలు మండలంలో..**

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం త్రోవగుంట, కొప్పోలులో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. త్రోవగుంటలో అన్నదానం చేశారు. కొప్పోలులో పులిహోరను పంపిణీ చేశారు. కొప్పోలులో జరిగిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వడ్లమూడి మునీంద్ర, వీరగంధం శ్రీనివాసరావు, దాసరి రాఘవస్వామి, షేక్ కపిల్‌బాషా, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, నడిపినేని భాస్కర్, గోనుగుంట సుబ్బారావు, బత్తినేని కృష్ణమూర్తి, శనగల నరసారెడ్డి, నూనే సుధాకర్, కె.శ్రీనివాసరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, మదాల ఓంకారం, దొడ్డ చంద్రశేఖర్, దాసరి నరేష్, కాలె మస్తాన్, గద్దల శ్రావణ్, ఉన్నం నరసింహారావు, కాపూరి కృష్ణయ్య, కల్లూరి నాగేశ్వరావు, కోనంకి చిరంజీవి, పంది మోషే, అలాగే త్రోవగుంటలో జరిగిన కార్యక్రమంలో అభిమానులు, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని ఉలిచి, గుడమెళ్లపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నలమోతు బాలగంగాధర్, చుంచు శింగయ్య, వై.వెంకటశేషయ్య, వై.నరసింహారావు, పోకూరి వెంకటేశ్, చుంచు చందు, మండవ మల్లికార్జున, యర్రా అంజయ్య, గార్లపాటి అంజయ్య, పిల్లుట్లు సుధాకర్, చుంచు ఆదినారాయణ, రాయపాటి వాసు, కొమ్ము అచిత్, గల్లా గోపీ, కొండమూరి వీరయ్య పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు మండలంలో..**

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు గురువారం టీడీపీ నాయకులు నాగులుప్పలపాడు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీఎస్.విజయకుమార్ నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరుల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వల్లే బడుగు, బలహీన వర్గాల ప్రజలు నాయకులుగా ఎదిగారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదించాలని, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కాగా తిమ్మసముద్రం, మద్దిరాలపాడు, ముప్పాళ్ల, హనుమాపురంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు నివాళుర్పించారు. కాగా ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడుల్లో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, వజీఈ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాదు. నాయకులు కనగాల శ్రీనివాసరావు, తిరువులశెట్టి శ్రీను, కాట్రగడ్డ చంద్రబాబు, కె.సెల్వం, బెల్లం వెంకటేశ్వర్లు, స్వర్ణ కిషోర్, ఆంజనేయులు, శ్రీనివాసులు, సుబ్బారావు, జనసేన నాయకులు పెంట్యాల వెంకటేశ్వర్లు, చుండూరి నాగేశ్వరరావు, గూడూరు ఝాన్సీరాణి, ఉప్పుటూరి హరినాథ్, నందిగం కోటయ్య, బొడపాటి వెంకటసుబ్బయ్య, నిమ్మల శ్రీను, సుమన్, విశాక్, పవన్, పెనుబోతు సునీల్‌బాబు, షేక్ ఖాజావలి, నెప్పల శివ, నెప్పల కృష్ణమూర్తి, తాళ్లూరి అంజిబాబు, వద్దినేని శేషయ్య, పూనాటి శ్రీరాములు, దావులూరి ఆంజనేయులు, తూమాటి బాలయ్య, అంచెపోగు మత్తయ్య, మంగమూరి మధుబాబు, తేళ్ల మధుబాబు, డాక్టర్ సురేష్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఈదుమూడి, ఎం.ముప్పాళ్ల గ్రామాలలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో నాయకులు మండవ వాసు, పెంట్యాల సురేష్, పోకూరి నాగరాజు, జెట్టి వెంకటస్వామి, పెండ్యాల కోటేశ్వరరావు, నల్లూరి ప్రసాదు, బొడ్డు దుర్గాప్రసాదు, పులిపాటి బాబు, జనసేన నాయకుడు పులిపాటి నాగబాబు, తగిరస వెంకట్రావు, మండవ హనుమంతరావు పాల్గొన్నారు.


కొప్పోలులో నాయకులు, కార్యకర్తల నివాళి

**చీమకుర్తి మండలంలో..**

చీమకుర్తి: తెలుగువారి హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయ వ్యక్తిగా నిలిచి పోయారని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో బీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి జరిగిన సభలో దాదాపు 60కుటుంబాలకు చెందిన చీమకుర్తివాసులు టీడీపీలో చేరగా వారికి కండువాలు విజయకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, షేక్ మోమిన్, సూరంపల్లి హనుమంతరావు, కందిమళ్ల గంగారావు పాల్గొన్నారు. కాగా ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని పేద మహిళలకు సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ మోమిన్, మూనీర్‌బాష, బాజీ, రఫీ, చాంద్‌బాష, షరీఫ్, అమానుల్లా పాల్గొన్నారు.

అలాగే సంతనూతలపాడు, మద్దిపాడులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజవర్గ ఇన్‌చార్జి బీఎస్ హాజరై ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉలిచిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


గుడిమెళ్లపాడులో..


నాగులుప్పలపాడులో..


ముప్పాళ్లలో..


ఈదుమూడిలో..


ఉప్పుగుండూరులో అన్నదానం చేస్తున్న బీఎస్

## అంబేడ్కర్ చూపిన దారిలో సీఎం జగన్

- మంత్రి ఆదిమూలపు సురేష్


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఒంగోలు నగరం, జనవరి 18: బడుగు, బలహీన వర్గాలకు అధికారం కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని, ఆయన చూపిన మార్గంలోనే సీఎం జగన్మోహనరెడ్డి సాగుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణశాఖామాత్యులు ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న నేపథ్యంలో గురువారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో సామాజిక సమతా సంకల్పం పేరుతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత తదితరులు హాజరయ్యారు. ముందుగా స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళిలర్పించి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో మంత్రి నూకతోటి శరత్‌బాబు పాడిన భారత రత్నమా..జాతికి దీపమా గీతాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి లక్ష్మానాయక్, పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, డీటీసీ సుశీల, ఈడీ అర్జున్‌నాయక్, ఆర్ఐవో సైమన్‌విక్టర్, మైనార్టీ సంక్షేమశాఖాధికారి సునీల్, నాయకులు రవిబాబు, వెంగళరావు, లక్ష్మయ్య. జయరావు, పేరం సత్యం, రఘురామ్, కరవది సుబ్బారావు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై పోలీసుల ఉక్కుపాదం

- 200 మందికి నోటీసులు

ఒంగోలు(క్రైం), జనవరి18: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు నెల రోజులు పైగా చేస్తున్న ఆందోళనపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. శుక్రవారం విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి ఎవరూ వెళ్ళకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి నుంచి ముఖ్యమైన నాయకులపై నిఘా ఉంచారు. అంతేకాకుండా విజయవాడ వెళ్ల కూడదంటూ నోటీసులు జారీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ముందస్తు అరెస్టులు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయా మండలాల్లోని ముఖ్యమైన యూనియన్ నాయకుల ఇళ్ళ వద్దకు వెళ్ళిన పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ విధంగా సుమారు 200 మందిని గుర్తించి వారిపై పూర్తిగా నిఘా ఉంచారు.



## అవీ..ఇవీ..

### 22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

ఒంగోలు(విద్య), జనవరి 18: అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మల్లికార్జునరావు, టి.దిలీప్‌చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 22వతేదీ ప్రభుత్వం పాఠశాలలను పునఃప్రారంభించాలని ఉత్తర్వులు ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆ రోజు స్కూళ్లకు హాజరుకావాల్సి ఉందన్నారు. అయితే ఆరోజు స్థానికంగా దేవాలయాల్లో శ్రీరామునికి సంబంధించిన కార్యక్రమాలు ఉండటం వల్ల విద్యార్థులు వాటిల్లో పాల్గొనలేక పోతున్నారని తెలిపారు. ఇది మెజార్టీ ఉపాధ్యాయుల మనోభావాలకు సంబంధించిన విషయం కనుక ప్రభుత్వం పునరాలోచించి పాఠశాలకు సెలవులు ప్రకటించి 23న పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### తెలంగాణ కాంగ్రెస్ నాయకుల తిరుపతి పాదయాత్ర

ఒంగోలు(క్రైం), జనవరి18: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మొక్కుకున్న ఇరువురు యువకులు కాలినడకన తిరుమల బయలుదేరేరు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడేం జిల్లా పెన్నపాక నియోజకవర్గం మణుగూరు నుంచి జానపాటి వేణు, చీమలరమేష్ కాలినడకన శ్రీవారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. గురువారం ఉదయం ఒంగోలులో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ వారికి ఘనస్వాగతం పలికి సుమారు 15 కిలో మీటర్లు ఒంగోలు నుంచి టంగుటూరు వరకు నడిచి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు.

### వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జనవరి 18: గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమైక్య ఉలిచి ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని అనాథలు, యాచకులు, రిమ్స్‌లో రోగుల సహాయకులకు సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, మండవ మురళీకృష్ణ, మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు, లావణ్య, కోసూరి శ్రీదేవి పాల్గొన్నారు.

### నవోదయ ప్రవేశపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో వీఎస్.సుబ్బారావు ఆదేశించారు. గురువారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, సెంటర్ లెవల్ అబ్జర్వర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. నవోదయ ప్రవేశపరీక్షకు 3921 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, అందుకోసం 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కందుకూరు, వలేటివారిపాలెం, సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, చీమకుర్తి, ఒంగోలు, అద్దంకి, మార్టూరు, ఇంకొల్లు, చీరాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం పది గంటలకే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ కె.శివకుమార్, ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి18: ఉప్పుగుండూరులో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వైద్యశిబిరం, రక్తదానశిబిరం నిర్వహించారు. ఒంగోలు వెంకటరమణ వైద్యశాల, ఒంగోలు కిమ్స్ వైద్యులు 150మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 21మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎస్.విజయకుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండల కారదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాదు, కనగాల శ్రీను, కె.సెల్వం, బెల్లం మురళి, తిరుమలశెట్టి శ్రీను, బెల్లం శ్రీను, ఎస్.ఆంజనేయులు, గోగినేని ఆంజనేయులు, కాట్రగడ్డ చంద్రబాబు, ఐటీడీపీ బెల్లం వెంకటేశ్వర్లు, డాక్టర్ వి.చెంచయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. .

### 21న 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18: గుంటూరులోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో ఈనెల 21 వ తేదీన జన విజ్ఞాన వేదిక ఆధర్వంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగాల సకలనం మండలిలో మాస్టారు అనే పుస్తకావిష్కరణ ఉంటుందని జేవీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. ఒంగోలులోని జేవీవీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు హాజరవుతారని, పుస్తక పరిచయం ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు చేస్తారన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ అభివృద్ధి సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. టీయూఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం 16 ఏళ్ళు శాసనమండలి సభ్యునిగా పనిచేశారన్నారు. విద్యారంగంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపైనా శాసనమండలిలో చేసిన ఉపన్యాసాల సంకలనంగా పుస్తకంగా ప్రచురించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.జయప్రకాష్, తిరుపతయ్య, రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ బందారు లక్ష్మీనారాయణ, కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌కే.ఖాజాహుస్సేన్, నల్లూరి వెంకటేశ్వరరావు, జి.ఉమామహేశ్వరి, ఎస్‌వీ.రంగారెడ్డి, మాలకొండయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### 252మందికి వైద్యపరీక్షలు

ఒంగోలు(రూరల్), జనవరి 18: త్రోవగుంటలో ఎన్టీఆర్ వర్ధంతిని సందర్భంగా సందర్భంగా ఒంగోలు నగరానికి చెందిన ఆలూరి మల్టీసూపర్‌స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 252మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆలూరి ప్రభాకరరావు, అనసూర్య, ఏపీ.సుందరరావు, వెంకటేశ్వర్లు, వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ రమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మూర్తి, నిర్వాహకులు యర్రంనేని వేణుగోపాల్, గోపీకృష్ణ, శ్రీనివాస్, వెంకట్రావు, రామకృష్ణ పాల్గొన్నారు

### ఎన్నికల నిర్వహణాధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న ఈఆర్వో వరకుమార్

చీమకుర్తి, జనవరి18 : జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నాలుగుమండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సెక్టోరియల్ అధికారులతో గురువారం చీమకుర్తిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వరకుమార్ పోలింగ్‌కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పిన్నిక మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ట్రాఫిక్ మళ్లింపు : డీఎస్పీ

ఒంగోలు(క్రైం), జనవరి18: విజయవాడలో శుక్రవారం అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహ ఆవిష్కరణ జరుగునున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఈక్రమంలో విజయవాడ వెళ్లే వాహనాలను త్రోవగుంట నుంచి చీరాల రోడ్డుకు మళ్ళించినట్లు డీఎస్పీ కె.నారాయణస్వామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు నెల్లూరు నుంచి హైవేపై విజయవాడ వెళ్లే వాహనాలు చీరాల నుంచి జగ్గయ్యపేట, అక్కడి నుంచి హనుమాన్ జంక్షనుకు చేరుకొని వెళ్ళాలని, ఉదయం 9నుంచి రాత్రి 12గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు.



చిలంకూరులో మంత్రికి సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

# ముసిపై ఆనకట్ట నిర్మాణానికి చొరవ చూపాలి

● మంత్రి సురేష్‌కు చిలంకూరు గ్రామస్థుల వేడుకోలు

మర్రిపూడి, జనవరి 18 : మునిసనదిపై ఆనకట్ట నిర్మాణానికి చొరవ చూపించాలని గురువారం చిలంకూరు గ్రామానికి వచ్చిన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను గ్రామస్థులు వేడుకున్నారు. ఆనకట్టతోపాటు రోడ్ కం బ్రిడ్జి ఏర్పాటు చేస్తే మర్రిపూడి, చీమకుర్తి మండలాలకు అనుసంధానం కలుగుతుందని వివరించారు. అంతేగాక అటు చీమకుర్తి ఇటు మర్రిపూడి మండలాల్లోని వెయ్యి ఎకరాలకుపైగా సాగు నీరు అందించవచ్చుని, భూగర్భజలమట్టం పెరిగి మెట్ట వ్యవసాయం వేల ఎకరాల్లో సాగుచేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరారు. మర్రిపూడికి చెందిన వైసీపీ నాయకుడు వినుకొళ్ళ సుబ్బారెడ్డి, ఎంపీపీ వెంకటరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధారాణి, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావ్, నాయకులు బోదా రమణారెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ కదిరి భాస్కర్, మాచేపల్లి నాగయ్య, హనుమంతరావు ఉన్నారు.



పశుపోషకులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని బేబిరాణి

# మేలుజాతి పశు సంపదను పెంపొందించుకోవాలి

మర్రిపూడి, జనవరి 18 : మేలుజాతి పశుసంపదను పెంచుకొనేందుకు పశుపోషకులు కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని బేబిరాణి చెప్పారు. మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో జరిగిన లేగదూడల ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 30 లేగ దూడలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అందమైన లేగ దూడల పశుపోషకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పొదిలి సహాయ సంచాలకులు డాక్టర్ వేణు, డీఎల్‌డీఏ చైర్మన్ రాధ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కాలేషా, మర్రిపూడి పశువైద్యాధికారి శ్రావణి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏహెచ్ఏలు రాంబాబు, జాషువ, మల్లికార్జున పాల్గొన్నారు.

# తెలుగోడి కీర్తి పతాక ఎన్టీఆర్

## టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య

## పలుగ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు

కొండపి, జనవరి 18 : తెలుగువాడి కీర్తి పతాక దివంగత ముఖ్యమంత్రి, సినీనటుడు ఎన్టీరామారావు అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం కొండపిలోని దివంగత ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, పార్టీ నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, బూదవాటి సోమయ్య నన్నూరి సుబ్బరామయ్య, షేక్ ఖాజషా తదితరులు పాల్గొన్నారు. పెరిదేపి, కట్టావారి పాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను సత్య ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కట్టావారిపాలెం నాయకులు మానికొండ వెంకటేశ్వర్లు,



మర్రిపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రావెళ్ల రఘునాథ్‌బాబు, అనుమాల ప్రసాద్, రాంబాబు, పెరిదేపి గ్రామ నాయకులు సోమేపల్లి కోటేశ్వరరావు, రాయపాటి వెంకటరావు, మార్పూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కె.ఉప్పలపాడు గ్రామంలోని దివంగత ఎన్టీఆర్,



కె.ఉప్పలపాడులో దివంగతులు ఎన్టీఆర్, పట్టాభి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్

దివంగత మాజీ శాసనసభ్యుడు గుండపనేని పట్టాభిరామస్వామి చౌదరి విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే అచ్యుత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్మూర్తి నాయుడు, మహిళలు పాల్గొన్నారు.

### జరుగుమల్లి మండలంలో...

జరుగుమల్లి, దావగూడూరు, నర్సింగోలు, చతుకుపాడు, కామేపల్లి గ్రామాల్లో దివంగత ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, పాతూరి కోటేశ్వరరావు, బ్రహ్మేంద్రం, కొమ్మాలపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### టంగుటూరులో..

టంగుటూరు : తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక దివంగత ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన గురువారం టంగుటూరులో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు చిరునామా ఎన్టీఆర్ అని, ఆయన పరిపాలనలోనే ఆడపడుచులకు ఆస్తి హక్కు, పేదలకు పక్కా గృహాలు, రూ.2 కిలో బియ్యం, సబ్సిడీ ధరలకు రేషన్, దోవతులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, పోతుల చెందయ్య, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, మండల యువజన నాయకుడు అబ్బీ షేక్, నాయకులు కుందేటి వెంకట్రావు, కసుకుర్తి భాస్కర్, జక్కుల శ్రీనివాసరావు, మొలకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావూరి తిరుమల రాధా కృష్ణ నేతృత్వంలో ఎన్టీఆర్ సేవాసమితి క్యాలెండర్‌ను సత్య ఆవిష్కరించారు.

### సింగరాయకొండలో...

సింగరాయకొండ: స్థానిక కందుకూరురోడ్డు కూడలిలో మండల టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ 28 వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్, మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు కాంస్య విగ్రహాలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, మండలపు గాంధీచౌదరి, ఇమ్మిడిశెట్టి రామారావు, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు రాయపాటి సీతమ్మ, సన్నెబోయిన మాలకొండయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, అబ్దుల్ సుభాన్, యస్దాని, సనావుల్లా, శీలం చంటి, శేషారావు, కాకా శ్రీనివాసులు, రవిశంకర్‌రెడ్డి, మల్లికార్జున, దక్షిణం శ్రీను, జమ్ము శంకర్, మేకల అంకమరావు పాల్గొన్నారు.



పొన్నలూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



టంగుటూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న సత్య, బెజవాడ, కామని తదితరులు

### మర్రిపూడిలో...

మర్రిపూడి : మర్రిపూడిలో జరిగిన కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్ళూరి నర్సింహారావు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, నాయకులు గొంటు హనుమారెడ్డి, సారెడ్డి యోగిరెడ్డి, పుల్లారెడ్డి, కె. మోహన్‌రావ్, ఆర్. వెంకటేశ్వర్లు, చెరెడ్డి నర్సారెడ్డి, చిన్న రమణారెడ్డి, ఉప్పు రమణయ్య, బి. యోసుదాస్, ధర్మరాజు గురవయ్య, ఉప్పు సాయిబాబు, పొదిలి ఏడుకొండలు, చిన్న దొర, మద్దూరి దాస్ పాల్గొన్నారు.

### పొన్నలూరులో..

పొన్నలూరు(కొండపి : దివంగత ముఖ్యమంత్రి 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు' అని నమ్మి పేద వారి సంక్షేమం కోసం పాటుపడ్డాడని టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం పొన్నలూరులోని దివంగత నేతలు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

# అంగన్‌వాడీల ర్యాలీ

## సీడీపీవోకు అంగన్‌వాడీల సమాధాన పత్రాలు

టంగుటూరు, జనవరి 18 : సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు జారీ అయిన నేపథ్యంలో గురువారం వారందరూ ర్యాలీగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వచ్చారు. సీడీపీవోను కలసి ఆ నోటీసులకు వారి సమాధానాన్ని పత్రాలను అందించారు. అంగన్‌వాడీలంతా సమ్మెలో ఉండడం వలన నోటీసులు అందరికీ అందలేదు. దీంతో ఐసీడీఎస్ అధికారులు కొందరికి రిజిస్టర్ పోస్టు చేయగా, మరికొందరికి వారి ఇళ్ల గోడలకు అంటించారు. సీడీపీవోను కలసిన అంగన్‌వాడీలంతా మూకుమ్మడిగా ఒకే సమాధానాన్ని పత్రాల రూపంలో అందించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి. రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి. శేషమ్మ, జి. సుభాషిణి, హేమలత, కృష్ణవేణి, ఆశాబి, జి. ప్రసన్న నాయకత్వం వహించారు.

### అంగన్‌వాడీలకు సమ్మెకు మద్దతు

### పదివేల రూపాయల విరాళం అందించిన సత్య

కొండపి : అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం 38వ రోజుకూడా నిరాటంకంగా కొనసాగింది. కొండపిలోని నిరసన శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని, జీతం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలకు న్యాయం చేసే బాధ్యత పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు తీసుకుంటారని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి పదివేల రూపాయల విరాళం అందజేశారు.

# కులగణనకు సహకరించాలి

కొండపి, జనవరి 18 : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన కార్యక్రమం నిర్వహించనున్నారని తహసీల్దార్ పి. శింగారావు ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ యజమాని, సభ్యులు కులగణన కోసం వచ్చే సిబ్బందికి ఇచ్చే సమాచారం భద్రంగా, గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు.

### స్థల సమస్యను పరిష్కరించిన తహసీల్దార్

మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తికి, పొరుగు వ్యక్తికి స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. దీంతో రాజు గురువారం ఉదయం గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి కొంతసేపు హడావుడి చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పి.శింగారావు, రెవెన్యూ సిబ్బంది ఆ రెండు కుటుంబాలతో మాట్లాడారు. ఇరు కుటుంబాల వారికి నచ్చచెప్పి సమస్యను పరిష్కరించానని తహసీల్దార్ చెప్పారు.



# ఒంగోలులో పేదల ఇంటి స్థలాలకు లైన్ క్లియర్

## రూ.180 కోట్లు మంజూరు

## రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18 : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో పేదలకు ఇంటి స్థలాలను ఇచ్చేందుకు లైన్ క్లియర్ అయింది. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పంపిణీకి అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయని పరిస్థితి ఏర్పడింది. నగరంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇస్తేనే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తానని, లేనిపక్షంలో పోటీ చేసే ప్రసక్తి లేదని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అయితే ఇటీవల జిల్లాలో ఎమ్మెల్యే అభ్యర్థుల చేర్పులు, మార్పుల ప్రక్రియలో జరిగిన పరిణామాలతో బాలినేని తనకు ప్రాధాన్యత లేదని అవేదన చెందుతూ హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఇంకొక వైపు సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు మూడు రోజుల పాటు విజయవాడలో వేచి చూసినా కలిసేందుకు అవకాశం కూడా రాలేదు. దీంతో బాలినేని తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు.

ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. అనంతరం సీఎంవో అధికారులను కలిసి భూ సేకరణకు చెల్లించాల్సిన నిధుల మంజూరుపై చర్చ జరిగింది. ఎట్టికేలకు బుధవారం అర్ధరాత్రి భూసేకరణకు అవసరమైన రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కార్పొరేషన్ పరిధిలోని మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెం, యరజర్ల గ్రామాల్లో 220.53 ఎకరాలను రెవెన్యూ అధికారులు భూసేకరణ చేశారు. అందుకోసం రూ.210 కోట్లు అవసరమైంది. గతంలో భూసేకరణకు రూ.30 కోట్లు మంజూరు చేయగా మరో రూ.180 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో రూ.180 కోట్ల మొత్తాన్ని విడుదల చేస్తూజీవో నెంబరు 44ను బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆయా భూముల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఇంకొక వైపు కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం రాత్రి రూ.21.35 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎట్టికేలకు ఒంగోలు నగరంలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు లైన్ క్లియర్ అయింది.



ఊడిపడిన ఈఎన్‌టీ గది శ్లాబ్ పెచ్చులు

# జీజీహెచ్‌లో తప్పిన ప్రమాదం

● ఊడి కిందపడిన ఈఎన్‌టీ గది శ్లాబ్ పెచ్చులు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 18 : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రమాదం తప్పింది. 11వ వార్డులోని ఈఎన్‌టీ గది శ్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో రోగులు ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సదరమ్ స్లాట్ బుక్‌చేసుకున్న వారు పరీక్షల నిమిత్తం ఇక్కడకు రావడంతో ప్రత్యామ్నాయ వార్డులో నిర్వహించారు.





# నాటకోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(రూరల్), జనవరి18: ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్‌రూమ్ ఆవరణలో గురువారం రాత్రి ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటకోత్సవాలను ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కంచర్ల రామయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వాహకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల రామయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రపంచ ప్రఖ్యాత సినీనటుడన్నారు. కాగా చిన్నారులు నిర్వహించిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, ఎస్.కోటేశ్వరరావు, కఠారి నాగేశ్వరరావు, కాట్రగడ్డ రఘు, నలమోతు బాల గంగాధర్, పాతూరి పూర్ణచంద్రరావు, కళామిత్రమండలిఅధ్యక్షుడు అంకమ్మరావు,బాలకోటయ్య పాల్గొన్నారు.



నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులు

## వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

చినగంజాం, జనవరి 18: రొయ్యల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అవనిగడ్డ రాములు(68) గ్రామ సమీపంలోని వాగులో రొయ్యలు పట్టుకునేందుకు గురువారం ఉదయం వెళ్లాడు. రొయ్యల వేటచేసే సమయంలో రాములు వాగులో పడిపోయాడు. వాగులో వేట చేస్తున్న గ్రామానికి చెందిన మత్స్యకారులు గమనించి రాములును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆయన మృతి చెందాడు.



అన్నంబొట్లవారిపాలెంలో పోటీలో తలపడుతున్న ఎడ్లు

## హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 18: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన 36వ జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్థానిక గోరంట్ల రత్తయ్య చౌదరిక మెమోరియల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన పోలురాధ ఎడ్ల బలప్రదర్శనలో వివిధ ప్రాంతాల నుండి 22 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావటంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్‌ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.



# సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

▸ ప్రయాణికులకు తప్పని తిప్పలు

అద్దంకి, జనవరి 18: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం జగన్మోహనరెడ్డి హాజరయ్యే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈక్రమంలో అద్దంకి డిపో నుంచి 25 ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేశారు. డిపోలో 40 బస్సులు ఉండగా, అందులో 25 పల్లె వెలుగు బస్సులను గురువారం సాయంత్రం నుంచే రద్దు చేశారు. బాపట్ల, చీరాల తదితర ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు ఆయా గ్రామాలకు ఈ బస్సులను పంపినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. దీంతో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల బస్ సర్వీసులు రద్దు అయ్యాయి. అద్దె బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఆయా రూట్లలో నడిచాయి. బస్సులు రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రకటించకపోవటంతో వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి అద్దంకి వచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్లేందుకు నానాఅవస్థలు పడ్డారు. గత్యంతరం లేక ఆటోలు, ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించారు. శుక్రవారం కూడా అత్యధిక రూట్లలో బస్సులు నడిచే అవకాశం లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు






కంభంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, తర్లుపాడులో పండ్లు అందజేస్తున్న నాయకులు, మార్కాపురంలో అన్నదానం చేస్తున్న కార్యకర్తలు, పొదిలిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళి

# ప్రజల ఆరాధ్యదైవం ఎన్‌టీఆర్

- ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు
- సేవాకార్యక్రమాలు నిర్వహించిన కేడర్
- నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు నివాళి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 18: ప్రపంచంలో తెలుగు జాతి ఖ్యాతిని చాటిన మహనుభావుడు ఎన్టీఆర్ అని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. దోర్నాల బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి కందుల నారాయణరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడారు. తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్‌టీఆర్ అన్నారు. తెలుగు జాతి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఎన్‌టీఆర్ అన్నారు. అనంతరం ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, షేక్ మౌలాలి, కొప్పుల వెంకటేశ్వర్లు, కాకర్ల శ్రీనివాసులు, గులాబ్, షాకీర్, మర్రి ఝాన్సీ, మర్రి రమణ, కనిగిరి బాలవెంకటరమణ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పేద ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి ఎన్‌టీఆర్ ఎనలేని కృషి చేశారన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రాజకీయాలు అవకాశాలు కల్పించింది ఎన్‌టీఆర్ అని అన్నారు. వారి ఆశయాలను నెరవేర్చే విధంగా టీడీపీ ఎల్లవేళలా బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, శీలం కృష్ణ, వినుకొండ చిన్న, ఖాదర్, పద్మావతి, యశోదమ్మ, ఈదుల రామచంద్రరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాస మస్తాన్, మాజీ సర్పంచ్ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

పొదిలి : ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు పట్టణంలోని పెద్దబస్టాండ్, కాటూరివారిపాలెం, కుంచేపల్లి, తలమళ్ల, పొదిలమ్మగుడి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యులు కాటూరి పెదబాబు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆశాదీపం, పేదల పెన్నిధి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన హయాంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్, ముస్లిం, మైనారిటీ సంఘం జిల్లా అధ్యక్షులు రసూల్, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, గౌస్, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇమాంమ్‌సా, కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, ఎస్సీసెల్ నాయకులు జ్యోతి మల్లిఖార్జున్, నాయకులు పోపూరి నరేష్‌బాబు, యాసిన్, పొల్లా నరసింహారావు, బొడ్డు సుబ్బయ్య, దివ్వెల మురళీ, లాయర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 28వ వర్ధంతిని మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాతముడివేముల, ఒడ్డుపాలెం, కొత్తఅన్నసముద్రం, చెర్లోపల్లి, మిట్టపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ నటుడిగా చిత్ర పరిశ్రమకు, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి, పేద బడుగు బలహీన వర్గాలకు, తెలుగు జాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వలరాజు, వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటి మాజీ చైర్మన్ వంకాయలపాటి ఆంజనేయులు, దేవినేని చలమయ్య, ఊట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంభం : టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాలు కంభం, అర్ధవీడు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎల్.కోటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌టీఆర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కేతం శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి గోనా చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ప్రభుత్వవైద్యశాల మాజీ చైర్మన్ తోట శ్రీనివాసులు, బీసీసెల్ అధ్యక్షులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి అనీస్ అహమ్మద్, జిల్లా మైనారిటీ నాయకులు దాదా, గని వెంకటేశ్వర్లు, కర్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : టీడీపీతోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమైందని, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎర్రగొండపాలెంలో గురువారం ప్రధాన కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్రంలో పేదప్రజలకు పక్కాగృహాలు నిర్మించి, కిలో రూ.2 బియ్యం పథకం ప్రవేశపెట్టి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడన్నారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పదవులు కల్పించిన మహానాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం మరిచి ప్రతిపక్షనేతలపై కేసులు పెట్టి లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదు, యేర్వ మల్లికార్జునరెడ్డి, మేకల వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షులు శనగా నారాయణరెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, కాకర్ల కోటయ్య, ఏ.వీరారెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, టీడీపీ ముఖ్యనాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీను, ఎం.మంత్రునాయక్, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, పాలడుగు వెంకటకోటయ్య, దొడ్డా శేషాద్రి, షేక్ మాబు, లింగాల అబ్రహాం, చేదూరి కిశోర్, కొత్త భాస్కర్, పోట్ల గోవింద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు : ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం తర్లుపాడు బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య టీడీపీ మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.గోపినాథ్ చౌదరి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, గౌతుకట్ల సుబ్బయ్య, ఖైరున్, నంబుల లక్ష్మయ్య, అంగిరేకుల బాలకోటయ్య, కాశంగి శ్రీనివాసులు, ఈర్ల వెంకటయ్య, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కొమరోలు : స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి కార్యక్రమాలు స్థానిక టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు చేయుతనిచ్చిన ఎన్‌టీఆర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్‌టీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు, ప్రజలకు బాగా ఉపయోగపడ్డాయన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎన్‌టీ రామారావు చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, జిల్లా రైతు నాయకులు బిజ్జం రవీంద్రారెడ్డి, నాయకులు పులకుర్తి వెంకటేశ్వర్లు, షేక్ నబీ, క్రిష్ణమోహన్ రెడ్డి, బాలిరెడ్డి, గోపాలక్రిష్ణయ్య శ్రీనివాసచౌదరి, మోహన్‌రెడ్డి, లాయర్ విజయ్‌కుమార్‌రెడ్డి, యల్లారెడ్డి కార్యాకర్తలు పాల్గొన్నారు.




త్రిపురాంతకం వై.పాలెంలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు

## అవీ..ఇవీ..

### మూగజీవాలను హింసించడం నేరం



కౌన్సెలింగ్ ఇస్తున్న జేడీ బేబిరాణి

పొదిలి, జనవరి 18 : మూగజీవాలను హింసించడం నేరమని పశు సంవర్ధకశాక జేడీ బేబిరాణి అన్నారు. గురవారం స్థానిక చిన్న బస్టాండ్ కూడలిలో మోటార్ బైక్‌కు కుక్కపిల్లను కట్టి ఈడ్చుకు పోతున్న ఘటన ఆమెకు కనిపించింది. వెంటనే ఆమె తన వాహనాన్ని ఆపి మోటార్ బైక్‌పై యజమానిని పిలిచి హెచ్చరించారు. ఎందుకు ఇలా చేస్తున్నావని ఆమె ప్రశ్నించారు. 'పెంచుకుంటున్నాని తన మాట వినడం లేదు' అని బదులిచ్చాడు. 'మాట వినకపోతే ఇలా హింసిస్తావా' అని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆ వ్యక్తిని మందలిస్తూ ఇలాచేయడం ఎంతపెద్దనేరమో తెలుసా అని ప్రశ్నించారు. ఏ జంతువునైనా, జీవినైనా ప్రేమతో దగ్గరకు తీసుకోవాలని అప్పుడే మనపై వాటికి అభిమానం పెరుగుతుందన్నారు. చిత్రహింసలకు గురిచేయడం నేరమన్నారు. ఇలాంటివి పునరావృతం అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### పైపులైన్ లీకుతో వృథాగా తాగునీరు



రహదారిపై వృథాగా పోతున్న నీరు

పొదిలి, జనవరి 18 : స్థానిక చిన్నబస్టాండ్ కూడలిలో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు వృదాగా పోతుంది. స్థానిక చేపల విక్రయం జరిగే ప్రదేశం వద్ద భూమిలో పైపుకు పెద్ద రంధ్రం ఏర్పడటంతో తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అసలే నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయాప్రాంత పట్టణవాసులకు ఈరోజు నీటి సరఫరా నిలిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నీటిపైపులకు మరమ్మతులు చేసి నీటిని అదించాలని ప్రజలు కోరుతున్నారు.

### లోపాలు లేకుండా కులగణన సర్వే

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 18: ఎలాంటి లోపాలు లేకుండా కుల గణన సర్వే నిర్వహించాలని 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత కోరారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని 10వ సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 28 వరకు వలంటీర్, సచివాలయ సిబ్బంది కలిసి ఈ సర్వేను చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వేను విజయవంతం చేయాలన్నారు.

### అసైన్‌మెంట్ భూమి హక్కు లబ్ధిదారుల జాబితాపై కసరత్తు



భూమి రికార్డులను సిద్ధం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

మార్కాపురం రూరల్ జనవరి 18: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూరక్ష, భూహక్కు పథకంలో లబ్ధిదారుల జాబితాను రెవెన్యూ అధికారులు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీల ద్వారా ప్రభుత్వ భూమిని పంపిణీ చేసి 20 సంవత్సరాలు పూర్తయిన లబ్దిదారులకు పట్టాలను మంజూరు చేసే కార్యక్రమం చేపడుతోంది. లబ్ధిదాలకు పట్టలను పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు జాబితాను తయారు చేస్తున్నారు. డివిజన్‌లోని వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమి పంపిణీ చేసి 20 సంవత్సరాలు పూర్తయిన లబ్దిదారుల జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

### యువకుడిపై కేసు నమోదు

- విధులకు ఆటంకం కలిగించాడని తహసీల్దార్ ఫిర్యాదు

ఎర్రగొండపాలెం, జనవరి 18 : తహసీల్దార్ విధులకు ఆటకం కలిగించాడని యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలాఉన్నాయి. ఎర్రగొండపాలెం ఒకటవ సచివాలయం పరిధిలో సర్వే నంబరు 996 పరిధిలో 3.21 డీకే భూమి కందూరి వరలక్ష్మి పేరిట ఉంది. సర్వే నంబరు 1027/1లో ఐదెకరాలు ఎకరాల భూమి కందూరు వాసవి పేర అన్‌లైన్‌లో ఉంది. వీరు సమీప బంధువులు అయితే ఈ డీకే భూమి వీరికి ఎలా వచ్చిందని తహసీల్దార్ నోటీసులు ఇచ్చారు. తమ కుటుంబ సభ్యులకు నోటీసులు ఇవ్వడంపై కందూరి సాయి గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తహసీల్దార్ రవీంద్రరెడ్డితో అనుచితంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో సాయిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజేష్ గురువారం సాయంత్రం కేసు నమోదు చేశారు.

### 252మందికి వైద్యపరీక్షలు

ఒంగోలు(రూరల్), జనవరి 18: త్రోవగుంటలో ఎన్టీఆర్ వర్ధంతిని సందర్భంగా సందర్భంగా ఒంగోలు నగరానికి చెందిన ఆలూరి మల్టీసూపర్‌స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 252మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు ఆలూరి ప్రభాకరరావు, అనసూర్య, ఏవీ.సుందరరావు, వెంకటేశ్వర్లు, డాక్టర్ రమా తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- తాగునీటికి అవస్థలు పడుతున్న ప్రజలు



దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్ద దోర్నాల, జనవరి 18: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులకు గురైంది. దీంతో గ్రామంలో రెండు డీప్‌బోరులు నిరుయోగంగా మారాయి. అసలే భూగర్భ జలాలు అడుగంటడంతో కొద్దిపాటి నీరే బోర్ల నుంచి వస్తోంది. ప్రస్తుతం ఆ నీళ్లు కూడా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మొత్తం మీద ఒక్కటే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. తరచూ ఆ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురౌతోంది. దీంతో విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదు. లో-వోల్టేజీతో తరచూ టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. తాగునీరు, వాడుక నీరు తెచ్చుకునేందుకు ఉన్న మోటార్లు కూడా వినియోగంలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అవకాశం ఉన్న వాళ్లు పొలాల వద్ద, దోర్నాలకు వెళ్లి మోటారుసైకిళ్లపై, తోపుడుబండ్లపై నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఆ సౌకర్యం లేని వారు, వృద్ధులు దివ్యాంగులు పరిస్థితి అయితే దారుణంగా తయారైంది. అసలే వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండడంతో ప్రజలు పనులు వెళుతున్నారు. ఇంటికి వచ్చే సరికి నీళ్లు లేకపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ విషయమై సంబంధిత జూనియర్ లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే ఆయన సక్రమంగా స్పందించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారన్నారు. ఇక ఏఈ ఫోన్ తీయడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. డబ్బులు వచ్చేవి ఉంటే అపరాత్రి అర్ధరాత్రి లేకుండా పనులు చేస్తారని, ప్రజలకు సంబంధించిన పనులకు అధికారులు పలకడం లేదని వాపోతున్నారు. కరెంట్ బిల్లులు మాత్రం ఎడాపెడా వసూలు చేస్తున్నారన్నారు. అయితే విద్యుత్ సరఫరా ఎందుకు సక్రమంగా చెల్లించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు**

తిమ్మాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల విషయమై ఏఈ నాగేంద్రరెడ్డి వివరణ కోరగా లైన్‌మెన్ అందుబాటులో లేడని, రాగానే సరిచేయిస్తానన్నారు. లైన్‌మెన్‌ను వివరణ కోరగా మార్కాపురం డీఈ వద్దకు వెళ్లానని చెప్పారు. సచివాలయం-3 లైన్‌మెన్ అందుబాటులో ఉన్నట్లు ఆయన చెప్పారు. సచివాలయం-3 లైన్‌మెన్ స్పందిస్తూ, తనకు సంబంధం లేదన్నారు. ఈ అంశంపై ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఇలా ఒకరిపై ఒకరు దాటవేత సమాదానాలు చెప్పడం గమనార్హం. ఉన్నతాధికారులైనా స్పందించి తగిన చర్యలు చేపట్టి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేసి, తాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది.

## టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

**ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి**



టీడీపీ బాండ్లు అందజేస్తున్న అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, జనవరి 18 : రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి కుంటుపడిందని టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం బేస్తవారపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ, జనసేనల ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. నాడు టీడీపీ హయాంలో తాను నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, ప్రతి వీధిలో సీసీ రోడ్లు, మంచి నీటి సౌకర్యం, అర్హులైన పేదలకు పక్కా గృహాలు,పెన్షలు, అనారోగ్యంతో బాధపడేవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కోట్ల రూపాయాల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో బీసీ భవనాలు, బకాపు భవనాలు, షాదీఖానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం చంద్రబాబు నాయుడితోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దూదెకుల సైదులు, కార్యదర్శి మూప్పూరి రాము, మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, గుంటక నరసింహ, పూనూరు భూపాల్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, దూదెకుల ఆదాం, బీసు అరుణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, బోయిళ్ళ రోషన్‌బాబు, నల్లగాల్వ శేషయ్య, అవ్వారి రామకృష్ణ, పోలిశెట్టి సుబ్రహ్మణ్యం, అనుముల కిషోర్ కూల్‌డ్రింక్ బాషా, సందు రమేష్, షేక్.రశీదు, షేక్.సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలి

**పార్టీ శ్రేణులకు నారాయణరెడ్డి పిలుపు**



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

పొదిలి, జనవరి 18 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా బూత్‌కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 5, 20వ వార్డులో బూత్‌కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తుకు వచ్చే రెండు నెలలే చాలా కీలకమన్నారు. వైసీపీ వ్యతిరేకులను టీడీపీ వైపు దృష్టి పెట్టేవిధంగా బూత్‌కమిటీ సభ్యులు పనిచేయాలని కోరారు. పార్టీ అధికారంలోకి ఇచ్చిన తరువాత వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అందుకు అనుకూలంగా సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళిక వేసుకొని ముందుకెళ్లాలన్నారు.. అనంతరం 13, 14 వార్డులలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధినేత చంద్రబాబు ప్రకటించిన మినిమేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహాశక్తి, యువగళం, ఇంటింటికి తాగునీరు, అన్నదాత సుఖీభవ, పూర్ టూరిచ్, బీసీలకు రక్షణ చట్టంపై ఆయన వివరించారు. ఎన్నికలు ఎప్పుడైనా రావోచ్చని ఈ తరుణంలో పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టికృషితో ముందుకు సాగాలన్నారు. తల్లికి వందనం ఎంతో బృహత్తరమైనదన్నారు. ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికి ఏటా 15వేల రూపాయల చొప్పున అందజేయ నున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి వారికి సామాజిక భద్రత కల్పిస్తారన్నారు. అంతేకాకుండా యువగళం కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు నెలకు 3వేల రూపాయల ఆర్థిక సహాయం చేయనున్నట్లు చెప్పారు. ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ అమలుచేయనుందన్నారు. విషయాలపై ప్రజల కు అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి సమష్టిగా చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై పోలీసులు ఉక్కుపాదం

ఒంగోలు(క్రైం), జనవరి18: తమ సమస్యల పరి ష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు నెల రోజు లు పైగా చేస్తున్న ఆందోళనపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. శుక్రవారం విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి ఎవరూ వెళ్ళకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి నుంచి ముఖ్యమైన నాయకులపై నిఘా ఉంచారు. అంతేకాకుండా విజయవాడ వెళ్ల కూడదంటూ నోటీసులు జారీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ముందస్తు అరెస్టులు చేయాలని



## కొనసాగిన అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షలు



గిద్దలూరులో పొర్లుదండాలు పెడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గిద్దలూరు, జనవరి 18 : అంగన్‌వాడీల నిరసన 38 రోజు కొనసాగింది. అయినప్పటికీ ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదు. దీంతో గిద్దలూరులోని సచివాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నేలపై పొర్లుదండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎస్మా ప్రయోగించినా, భయపడేది లేదన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరమించబోమన్నారు. అంగన్‌వాడీల ఆర్తనాదాలు ప్రభుత్వం చెవికి ఎక్కడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అంగన్‌వాడివర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణ కుమారి, మున్నా, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు పాల్గొని ప్రసంగించారు.

పొదిలి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల పరిష్కారం కోసం అంగన్వాడి కార్యకర్తలు చేస్తున్న నిర్వధిక సమ్మె 38వ రోజుకు చేరింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇచ్చిన హామీలు నిలబెట్టాలంటూ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విశ్వనాథపురంలోని వీధి వీధి తిరుగుతూ హామీలు అమలు చేయాలని ఎస్మా జీవో వెనక్కుతీసుకోవాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దగా నినాదాలు చేస్తూ వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ చిరు ఉద్యోగులపట్ల ప్రభుత్వం ఇంత మొండిగా వ్యవహరించడం సబబుకాదని విమర్శించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని అడుగుతున్నా, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతలా ఎస్మా ప్రయోగించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్మా బెదిరింపులకు భయపడేది లేదన్నారు.



సంజాయిషీ నోటీసులు చూపుతున్న కార్యకర్తలు

మార్కాపురం వన్‌టౌన్ : నోటీసుల పేరుతో బెదిరింపులకు గురిచేస్తే సమ్మె పోరాటం ఆగదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదరపు అన్నపూర్ణ హెచ్చరించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పశ్చిమ ప్రాంత ఐసీడీఎస్ ప్రాజెక్టు లీడర్ల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా అంగన్‌వాడీలతో చర్చలు జరపాలన్నారు. కోటీ సంతకాలతో జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.సుబ్బారావు మాట్లాడుతూ 38 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమన్నారు. మహిళా సాధికారిత అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం లక్షల మంది మహిళలు వీధుల్లో పోరాటం చేస్తుంటే పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి, ఉపాధ్యాక్షులు ఆవులయ్య, రూబెన్, అంగన్‌వాడీల నాయకురాళ్లు సరళ, ప్రభావతి, రమా, మల్లీశ్వరి, హాసిని, రుణ, కాశీశ్వరి, మేరి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ శాఖ సంఘీభావం తెలిపింది. టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ కన్నా మిన్నగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట మరిచారని ఆరోపించారు. అంగన్‌వాడీలు శాంతియుతంగా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని దీక్షలు చేస్తుంటే వారిపై ఎస్మా చట్టం ఉపయోగించడం, బెదిరింపు చర్యలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అంగన్‌వాడీలకు టీడీపీ శాఖ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దొడ్డా శేషాద్రి నాయకులు దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, సీనియర్ నాయకులు నాగెళ్ల సత్యనారాయణ, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్ సుబ్బరత్నం, రవికుమార్, పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు జారీ చేసిన సంజాయిషీ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వెళ్లారు. సమాధాన పత్రాలు ఇచ్చారు.



దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరులో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు, శంకరాపురంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ వెంకటరావు

# రామరాజ్యం స్థాపిద్దాం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పిలుపు
- గ్రామగ్రామానా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు
- పెద్దఎత్తున పాల్గొన్న టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు
- భారీ ఎత్తున అన్నదానాలు, సేవా కార్యక్రమాలు

కనిగిరి, జనవరి 18: తెలుగుజాతికి ఎన్టీయార్ కీర్తి శిఖరం వంటివారని, ఆయన ఆశయ సాధన కోసం, రామరాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ అటు సినిమా, ఇటు రాజకీయ రంగాల్లో విప్లవాత్మక మార్పులను తెచ్చారన్నారు. రూ.2కే కిలో బియ్యం పథకంలో పేదల ఆకలితీర్చిన గొప్ప వ్యక్తి అన్నారు. పార్టీలు మారినా ఆ పథకాన్ని కొనసాగించడం ఆయన ఆదర్శానికి నిదర్శనమన్నారు. టీడీపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అన్నికులాలకు సముచిత స్థానం దక్కిందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు, నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, చావలి చినవెంకటేశ్వర్లుయాదవ్, మూలే బాలిరెడ్డి, గుడిపాటి ఖాదర్, సిద్దాంతి బారాయిమాం, యలమంద, మారుతీ, కాసుల శ్రీరాం యాదవ్ పాల్గొన్నారు.

### అభిమానుల అధ్వర్యంలో..



పీసీపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ రోడ్డులో ఘనంగా ఎన్టీయార్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ఉగ్ర ముఖ్య అతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు ఎస్థానీబాషా (పులి), ఉంగరాల బాషా, తాతపూడి ఐజాక్, నజిముద్దీన్, తిరుపాలు, చిలకపాటి లక్ష్మయ్య, గిఫ్ట్ ఆర్టికల్స్ కొండలు, బడేబాయి, నన్నేబాయి, మస్తాన్ పాల్గొన్నారు.

పామూరు : మరణంలేని మహా మనిషి ఎన్టీఆర్ అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పలు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఉగ్ర పాల్గొన్నారు. కంభాలదిన్నెలో ఎన్టీఆర్ విగ్రహానికి ఉగ్ర పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఉగ్ర మాట్లాడుతూ తెలుగువారి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిచెప్పి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత ఎన్టీఆర్ అన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు యారవ శ్రీను ఆర్థిక సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. చిలంకూరు, బొట్లగూడూరు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు. ముబినామౌలాలి, దేవరపు మాల్యాద్రి, ఇర్రి కోటిరెడ్డి, చినహజరత్, కొంపెల్లి రాజేంద్ర, కౌలూరి రహంతుల్లా, మస్తాన్, నరసింహారావు, దైండే శివశంకర్, బీ సత్యం, హరిప్రసాద్, వేమూరి నవీన్, వినోద్, కావేరి రసూల్, మహిళా నాయకులు రమాదేవి, సుబ్బమ్మ, రమణమ్మ, నాగమని పాల్గొన్నారు. కంభాలదిన్నె కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య, ఏలూరి వెంకటేశ్వర్లు, అడుసుమల్లిన రసింహాలు, గంగయ్య చౌదరి, కొండయ్య, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, భాస్కర్, చౌదరిబాబు, కొండయ్య రమేష్ పాల్గొన్నారు.

వెలిగండ్ల : టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా వెలిగండ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్ర మాట్లాడుతూ పేదల కోసం ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉగ్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొనా ప్రతాప్, కొండు భాస్కర్ రెడ్డి, శ్రీను, పుల్లారెడ్డి, కేసరి రమాణా రెడ్డి, మాలకొండారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలొమన్ రాజు, రవి, తెలుగు రైతు అధ్యక్షుడు కాశయ్య, వెంకటేశ్వర్లు, మాలకోండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పామూరులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

### ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం

పీసీపల్లి, : పీసీపల్లి, వెంగళాయపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం చేసి, పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పీసీపల్లి ఎన్టీఆర్ విగ్రహం సెంటరులో టీడీపీ జెండాను ఎగురవేశారు. మండల నాయకులు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ధ్రువతారగా వెలిగి తెలుగువారి కీర్తిని ప్రపంచ నలుమూలలా విస్తరించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, గోగడి రత్నయ్య, వీరపనేని పెద్దన్న, మూలె సత్తిరెడ్డి, వీరపనేని నానిబాబు, బద్దిపూడి ఎబినేజరు, మలినేని వెంకటేశ్వర్లు,మారెళ్ల మాలకొండయ్య, కోమటి గుంట్ల వీరయ్య ఉప్పుగుండ్ల శివరామయ్య, నాగేశ్వరరావు, కసిరెడ్డి హనుమారెడ్డి, పల్లా మల్లికార్జున, చాగంరెడ్డి మాలకొండారెడ్డి, పెదబ్రహ్మయ్య, కొండపనాయుడు, మహేష్, మహేంద్ర, బ్రహ్మయ్య, పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డి, రమణయ్య, మాల్యాద్రి, వీరాంజనేయులు, నాగేంద్రబాబు ఉన్నారు.

### ఎన్టీఆర్‌కు నివాళి

దర్శి : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్ వద్ద ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, గోరంట్ల రవికుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీజీఎస్ క్లబ్ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. తెలుగుజాతి ఖ్యాతిని దిశదశల ఇనుమడింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని నేతలు కొనియాడారు. ఆయన ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సంగా తిరుపతిరావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా తెలుగు మహిళా నాయకురాలు ఎం శోభారాణి, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, గుర్రం బాలకృష్ణ, సందు రామయ్య పాల్గొన్నారు. అలాగే తూర్పువీరాయపాలెం, బోట్లపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను, అన్నదానాలను నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు గరికపాటి గోపి, పవన్ తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### కోలాహలంగా వేడుకలు

దొనకొండ : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బాణసంచా కాల్చుతూ కోలాహలంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి అక్కడ నుంచి రెండు వర్గాల వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో దొనకొండలోని ప్రధాన రహదారి మొత్తం పసుపుమయమైంది. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాథరెడ్డి, వల్లపునేని వెంకటస్వామి, పత్తి వెంకటేశ్వర్లు, షేక్ తోహిద్, వడ్లమూడి చెన్నయ్య, విప్పర్ల లక్ష్మీరావు, కొమ్మతోటి సుబ్బారావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, దుగ్గెంపూడి చెంచయ్య, యగ్గోని యల్లారెడ్డి, మన్నెం గాలెయ్య, నిమ్మకాయల సుబ్బారెడ్డి, పోతిపోగు చెన్నయ్య, వల్లపునేని కేశవ మరికొందరు నాయకులు ఎన్టీఆర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించి భారీ అన్నదాన కార్యక్రమంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ యువనాయకుడు వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, తోటా కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, ఫణిదపు అనంతరాములు, వేగినాటి అల్లూరయ్య, ఫణిదపు వీరాంజనేయులు, వైకే చౌదరి, షేక్ సుభాని, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, పురుషోత్తం సత్యానందం, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి, వేదిక వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.



దర్శిలో ఎన్టీఆర్, శ్రీరాములు విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న నేతలు

### సీనియర్ నాయకులకు ఘన సన్మానం

టీడీపీ యువ నాయకుడు వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలో టీడీపీకి విశిష్ట సేవలందించిన సీనియర్ నాయకుడు దుగ్గెంపూడి కాశయ్య పులిమి రమణాయాదవ్, షేక్ మగ్బూల్ అహమ్మద్, షేక్ మూసామియా(సర్దార్), డాక్టర్ మల్లికార్జునశర్మ, నూనె విజయకుమారి, షేక్ సుభాని, బత్తుల గాలయ్య, జనసేన మండల, పట్టణ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, షఫీ ఉల్లాఖాన్ (బాజీ)కి శాలువాలు కప్పి సన్మానించారు.

తాళ్లూరు : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ ఆరాధ్య దైవంగా నిలిచారని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు గోరంట్ల రవికుమార్, నాదెండ్ల బ్రహ్మంచౌదరి, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, మానం రమేష్‌బాబు, శాగంకొండారెడ్డి, తూర్పుగంగవరం నాయకుడు కనిశెట్టి రామలక్ష్మయ్య, షేక్ కాలేషావలి, గొలంలపూడి వేణుబాబు, షేక్‌మీరామొహిద్దీన్, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కూటాల ప్రసాద్, టీడీపీ నేతలు శ్రీనివాసరెడ్డి, మారాబత్తుల సుజాత, కోట అంకమ్మ, మెలికా అంజమ్మ పాల్గొన్నారు.

కురిచేడు : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను పోటాపోటీగా నిర్వహించారు. ఎంపీడీవో ఆఫీస్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే నారపుసెట్టి పాపారావు, మండల అధ్యక్షుడు నెమిలయ్య పాల్గొన్నారు. అన్నదానం, పాటకచేరీని ఏర్పాటు చేశారు.

### ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

ముండ్లమూరు : ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ముండ్లమూరు, పసుపుగల్లు గ్రామాల్లో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలాజీ మాట్లాడుతూ పేద ప్రజలకు కిలో రూ.2కే బియ్యం ఇచ్చి గుండెల్లో చిర స్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకులు గోరంట్ల రవి కుమార్, పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, వరగాని పౌలు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, నిడమానూరి శ్రీనివాసరావు, జిల్లెలమూడి చౌదరి, చిననారాయణరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, కూరపాటి నారాయణ స్వామి పాల్గొన్నారు. శంకరాపురంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మారెళ్ల బస్టాండ్ సెంటర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు పాలపర్తి సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తూర్పుకంభంపాడు, శంకరాపురంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు ఆధ్వర్యంలో నివాళులర్పించి, అన్నదానం ఏర్పాటు చేశారు.

### వెంకట్ ఆధ్వర్యంలో అన్నదానం

జనసేన పార్టీ దర్శి నియోజక వర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముండ్లమూరు, పెద ఉల్లగల్లులో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెంకట్ సోదరుడు పవన్, గోపీ ఆధ్వర్యంలో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కురిచేడులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

### విజేతలకు బహుమతులను అందజేసిన డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి, జనవరి 18 : క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. జనసేన పార్టీ పిలుపులో భాగంగా మన ఊరు - మన ఆట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదయిర్లపాడులో మూడురోజులుగా జరిగిన జేపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం ఉగ్ర బహుమతులను అందజేశారు. పల్లెల్లో క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి ముున్ముందుకు రాణించేలా కృషి చేయాలని క్రీడాకారులకు ఉగ్ర సూచించారు. అందరూ ఐక్యతతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి రహిముల్లా, ప్రోగ్రామ్ కమిటీ కార్యదర్శి సునీల్, మాదాసు రమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఇది కష్టపడే సమయం

### కార్యకర్తలకు ఉగ్ర దిశానిర్దేశం

వెలిగండ్ల, జనవరి 18 : ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు ఇది కష్టపడే సమయమని, ప్రతి ఒక్కరూ ఐక్యతతో కలిసి పనిచేస్తే విజయం వరిస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో శ్రేణులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీ కూటమి గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమన్నారు. అన్నివర్గాల ప్రజల కష్టాలు తీరాలన్నా, ఆనంద ఆంధ్రప్రదేశ్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకో వలసిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీలోకి వలసలు పెరుగుతున్న దృష్ట్యా వారిని కలుపుకొని అందరూ చురుగ్గా పనిచేయాలన్నారు. బూత్ స్థాయిలో అప్రమత్తంగా శ్రమించాలన్నారు. గ్రూపు రాజకీయాలకు తావి వ్వొద్దని హితవు చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు ఇంద్రభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, భాస్కర్ రెడ్డి, శ్రీ ను, పుల్లారెడ్డి, రమాణా రెడ్డి, మాలకొండారెడ్డి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, రవి, తెలుగు రైతు అధ్యక్షుడు కాశయ్య, వెంకటేశ్వర్లు, మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తకు సాయం

తాళ్లూరు, జనవరి 18 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకోల్పోయిన తూర్పుగంగవరంపంచాయతీ సోమవరప్పాడు గ్రామ టీడీపీ కార్యకర్త పేరుపాక బాలయ్యను ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నూకసాని బాలాజీ, శ్రీహర్షిని విద్యాసంస్థ చైర్మన్ గోరంట్ల రవికుమార్, దర్శి జనసేన నేత గరికపాటి వెంకట్ సోదరుడు గోపీ గురువారం పరామర్శించారు. గరికపాటి గోపి రూ .50వేల సాయం అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం

పామూరు, జనవరి 18 : సాయిబాబా మందిరంలో శ్రీ గురురాం రతన్‌జీ బాబా ఆశీస్సులతో మహాయజ్ఞ కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. అఖండ జ్యోతి ప్రజ్వలన, సాయినాథుని సచ్చరిత్ర పారాయణ కార్యక్రమాలను శ్రీ సిద్దయోగిని గురు మాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి మాట్లాడుతూ అఖండ జ్యోతి అనగా సాయినాథుని ఆత్మస్వరూపమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ భైరెడ్డి జయరామిరెడ్డి, కమిటీ చైర్మన్‌లు దేవకి సుబ్రమణ్యం, పబ్బతి వెంకటసుబ్బయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

## వెంటనే కేసు నమోదు చేయండి

### పోలీస్ స్టేషన్ వద్ద ఎంపీటీసీ, బంధువుల డిమాండ్

తాళ్లూరు, జనవరి 18 : తమపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎంపీటీసీ సభ్యులు, ఆమె బంధువులు గురువారం డిమాండ్ చేశారు. దోసకాయపాడు గ్రామ ఎంపీటీసీ సభ్యుని భర్త మద్యం మత్తులో ఎస్సీ యువకుడిని దూషించి చెప్పుతో కొట్టగా కేసు నమోదయిన విషయం తెలిసిందే. ఎస్సీ యువకుడు వడ్డే వేణుగోపాల్ తన బంధువులు, అనుచరులతో రెండ్రోజుల కిందట తమ ఇంటికి వచ్చి దుర్భాషలాడి, తమపై దాడి చేసేందుకు రాగా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎస్ఐ కేసు నమోదు చేయలేదని వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, ఆమె భర్త సోదరీమణులు వెంకటరాజ్యం, లక్కిరెడ్డి పద్మ ఆరోపించారు. నా భర్తపై అట్రాసిటీ కేసు పెట్టిన పోలీసులు తమపై దాడికి వచ్చిన వారిపై కేసు నమోదు చేయకపోగా, విచారణకు కూడా రాలేదని పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. కనీసం ఘటనపై విచారించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## వాగులో యువకుడి మృతదేహం

### ఐదు రోజుల క్రితం అదృశ్యం



మనోహర్‌రెడ్డి (ఫైల్)

కనిగిరి, జనవరి 18 : వాగు కుంటలో యువకుడి మృతదేహాన్ని మండలంలోని లింగారెడ్డిపల్లి సమీపాన పాలేటిపల్లికి వెళ్లే నీటి వాగులో గురువారం గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన సందిరెడ్డి మనోహర్‌రెడ్డి (20) గత ఐదు రోజులుగా కనిపించకుండా వెళ్లిపోయాడు. కనిపించకుండా వెళ్లిపోయిన మనోహర్‌రెడ్డి ఐదు రోజుల తర్వాత లింగారెడ్డిపల్లి వద్ద వాగులో శవమై తేలుతుండగా కొందరు గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని బయటికి తీశారు. కనిపించకుండా వెళ్లిపోయిన కుమారుడు వాగులో శవమై తేలడంతో తల్లితండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతికి కారణాలుమాత్రం తెలియకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువకుడి అదృశ్యంపై స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు కూడా నమోదు చేసినట్లు గత ఐదు రోజుల క్రితం సోషల్ మీడియాలో తెలియచేస్తూ, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు. కానీ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాలేదని, మృతదేహం వివరాలు కూడా తమ దృష్టికి రాలేదని ఎస్ఐ మాధవరావు తెలిపారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పీసీపల్లి, జనవరి 18 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.కోటయ్య తెలిపారు. రామాపురంలో వెంకటనారాయణ అనే వ్యక్తి మద్యంను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 8 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

## కులగణన సర్వే సక్రమంగా చేపట్టాలి

పామూరు, జనవరి 18 : కులగణన సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సక్రమంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి వీ బ్రహ్మానందరెడ్డి సూచించారు. సచివాలయంలో కులగణనపై గురువారం అవగాహన కల్పించారు. శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

## ఆగని అంగన్‌వాడీల ఆందోళన



చంటి బిడ్డతో ఆందోళనలో పాల్గొన్న అంగన్‌వాడీ

దర్శి, జనవరి 18 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన అంగన్‌వాడీల ఆందోళన 38వ రోజూ సాగింది. గురువారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో కార్యకర్తలు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోటి సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి పంపించే కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళనలో పసిబిడ్డతో కార్యకర్త కూర్చోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సీఐటీయూ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి మొండివైఖరి వీడి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, బాలమ్మ, ప్రశాంతి, ఫాతిమా, అజిత, మల్లేశ్వరి నాగమణి, శివకుమారి పాల్గొన్నారు.

కనిగిరి : వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించిందని, అంత మాత్రాన పోరాటం ఆగదని వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా చట్టం ప్రయోగిస్తే భయపడేదే లేదన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఆందోళన ఆగదన్నారు. ఎన్నికలకు ముందు ఓట్లు దండుకునేందుకు కల్లబొల్లి హామీలు చేసిన జగన్‌రెడ్డి సమస్యలపై సమ్మె చేసేవారిపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. ప్రభుత్వం అటు ప్రజల్లోనూ, ఇటు ఉద్యోగుల్లో వ్యతిరేకత మూట గట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు పాల్గొని మాట్లాడుతూ ఎస్మా నోటీసులకు తగిన సమాధానం చెప్తామన్నారు. అంగన్‌వాడీలకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేదే లేదన్నారు. తొలుత అంగన్‌వాడీలు నోటీసులను ప్రదర్శిస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నోటీసులకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకులు సీత, రజని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సుజాత, మనోరంజిత, రామసుబ్బులు, డీవైఎఫ్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.






# పంచాయతీలకు.. నిధులు

- ఫలించిన సర్పంచ్‌ల పోరాటం
- ఎట్టకేలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- 1172 పంచాయతీలకు రూ.41.01 కోట్లు
- పంచాయతీ ఖాతాలకు ఆర్థిక సంఘం నిధుల జమ



**ఎట్టకేలకు నిధుల కోసం పంచాయతీల ప్రథమ పౌరుల పోరాటం ఫలించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. పంచాయతీ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి నిధుల లేమితో తాము పనులు ఏమీ చేయలేక పోతున్నామంటూ సర్పంచ్‌లు వినూత్న రీతుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు నిధుల కోసం రోడ్డెక్కారు. ఆర్థిక సంఘం నిధులను వాడుకోవడంపై కేంద్ర ప్రభుత్వానికి కూడా రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచ్‌లు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో గురువారం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సర్పంచ్‌లు నిధులు సాధించుకున్నారు.**

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సర్పంచ్‌ల ఉద్యమం ఫలించింది. ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించడంపై పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు చేసిన పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిధుల అక్రమాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లారు. సర్పంచ్‌ల నిధుల ఉద్యమానికి వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇచ్చాయి. చివరకు సర్పంచ్‌లు సంక్రాంతి పండుగ రోజు భిక్షాటన కూడా చేశారు. ఇలా అనేక రూపాల్లో ఉద్యమం తీవ్రం చేయడంతో ప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఎట్టకేలకు 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలకు జమ కావడంతో సర్పంచ్‌లు, సదరు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కొంత మేర ఆర్థిక ఇక్కట్ల నుంచి పంచాయతీలు గట్టెక్కనున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిలాలకు సంబంధించి రూ.41.05 కోట్లు జమయ్యాయి. పల్నాడు జిల్లాలోని 519 పంచాయతీలకు రూ.17,58,79,659, బాపట్ల జిల్లాలోని 426 పంచాయతీలకు రూ.13,70,09,439 నిధులు విడుదలయ్యాయి. గుంటూరు జిల్లాకు సంబంధించి 227 పంచాయతీలకు రూ.9,72,62,511 జమ చేశారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులను పంచాయతీలు ఖర్చు చేయాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతున్న పంచాయతీలు ఈ నిధులతో కొంతమేర నిలదొక్కుకునే అవకాశం ఏర్పడింది. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తీర్చే అవకాశం సర్పంచ్‌లకు వచ్చింది.

### నాలుగున్నరేళ్లుగా మళ్లింపు

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తోంది. అయితే నాలుగున్నరేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించేసింది. వాటిని సొంతానికి వాడేసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కూడా రాష్ట్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. గ్రామ స్వరాజ్యం తీసుకువస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేస్తున్నది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అధికారాలకు గండి కొట్టిందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభ్వుతం పీడీ ఖాతాలకు బదిలీ చేసుకుంది. సచివాలయాల నిర్వహణ ఖర్చును కూడా స్థానిక సంస్థలపై వేస్తోంది. నిధుల్లేక పల్లెల్లో కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొంటున్నాయి. నిధులు జమ చేయాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో నిధుల కోసం సర్పంచ్‌లు ఉద్యమాలను ఉధృతం చేశారు. సొంత నిధులతో పనులు చేపట్టి అప్పులు పాలైన పలువురు సర్పంచ్‌లు అత్మహత్యలు చేసుకున్న సంఘటనలు న్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం స్పందించడంతో పాటు సర్పంచ్‌ల ఉద్యమంతో ఉక్కిరిబిక్కిరి అయిన రాష్ట్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. వెరసి 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లుగా ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది.

### ఉద్యమాలతో సాధించుకున్నాం



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు జమ చేసింది. ఉద్యమాల ఫలితంగానే ఈ నిధులు సాధించుకున్నాం. ఈ నిధులను పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వినియోగిస్తాం. భవిష్యత్‌లో కూడా పంచాయతీలకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలి.

\- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి

### కేంద్రం ఆదేశాలు పట్టించుకోకుండా..

పంచాయతీల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వాహణ తదితర పనులకు ఆర్థిక సంఘం నిధుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలోతొక్కింది. అయితే ఇందుకు విరుద్ధంగా నిధులను ప్రభుత్వం దారిమళ్లించి వాడేసుకుంది. 15వ ఆర్థిక సంఘం గత విడత నిధుల్లో దాదాపు రూ.81కోట్లు ఇతరాలకు వినియోగించుకుంది.

# జంగాకు షాక్?

- టిక్కెట్ లేదని తేల్చిన అధిష్ఠానం
- మళ్లీ మహేష్‌రెడ్డే పోటీ చేస్తారని వెల్లడి
- ఎమ్మెల్యే పార్థసారథితో కృష్ణమూర్తి భేటీ
- ఎమ్మెల్సీ జంగా నిర్ణయంపై ఊహాగానాలు



ఎమ్మెల్యే పార్థసారధి కార్యాలయంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, జనవరి 18: ఈ సారి నా ఓటు నేనే వేసుకుంటా.. గురజాల నుంచి పోటీ చేస్తా.. అని ప్రకటించిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి వైసీపీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. గురజాల టిక్కెట్‌ను తనకు ఇవ్వాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎంతోకాలంగా అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో సమావేశాలు కూడా గతంలో ఏర్పాటు చేశారు. అయితే జంగాకు టిక్కెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ సారి కూడా కాసు మహేష్‌రెడ్డే గురజాల నుంచి పోటీ చేస్తారని జంగాకు తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరనున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పార్థసారథితో పెనమలూరులోని ఆయన కార్యాలయంలో జంగా కృష్ణమూర్తి గురువారం భేటీ అయ్యారు. వీరిద్దరి కలయిక రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే పార్థసారథి టీడీపీలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో జంగా రాజకీయ ప్రయాణంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే జంగా తన నిర్ణయాన్ని ఇంకా తెలియజేయలేదు.

### జంగా తీవ్ర అసంతృప్తి

అధిష్ఠానం మాటలతో జంగా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారని తెలిసింది. తనకు పార్టీలో అడుగడుగునా అవమానం జరుగుతోందని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ పదవి ఆశించానని ఆ పదవి కూడా దక్కలేదని, ఈ ఎన్నికల్లో తనకు గురజాల టిక్కెట్ ఇస్తానని జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన హామీ కూడా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# తోటవారిపాలెంలో విషాదం

- విద్యుదాఘాతంతో నానమ్మ, మనవరాలు మృతి



మృతిచెందిన నాయనమ్మ, మనవరాలు

చీరాల టౌన్, జనవరి 18: మండల పరిధిలోని తోటవారిపాలెం రెడ్డికాలనీలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో నాయనమ్మ, మనవరాలు అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇందుకు సంబంధించి వివరాలు.. వ్యవసాయ కూలీ అయిన ఆట్ల మేనకోటమ్మ(70) ఇంట్లో నుంచి బయటకు వస్తూ నేలపై ఉన్న విద్యుత్ మోటార్ వైర్లను తొక్కింది. ఆప్రాంతంలో జాయింట్ ఉండటం, దానిపై టేప్ లేకపోవడంతో విద్యుదాఘాతానికి గురైంది. పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న మనుమరాళ్లు శ్రీనివాసులు(22), విజయలక్ష్మి బయటకు వచ్చి నాయనమ్మను కాపాడేందుకు పట్టుకున్నారు. దీంతో ముగ్గురూ విద్యుదాఘాతానికి గురయ్యారు. మేనకోటమ్మ, శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా విజయలక్ష్మికి గాయాలయ్యాయి. శ్రీనివాసులు సంక్రాంతి సందర్భంగా అత్తింటి నుంచి పుట్టింటికి రాగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నారా లోకేశ్

# ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు

- వాడవాడలా ఎన్టీఆర్ వర్ధంతుల్లో టీడీపీ నేతలు
- అన్నదానం, రక్తదానంతో నివాళులు అర్పించిన తమ్ముళ్లు



బాపట్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటిస్తున్న తెలుగుదేశం పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతికి గుర్తింపు, గౌరవం తెచ్చిన మహనీయుడు ఎన్టీ రామారావు అని టీడీపీ నేతలు కొనియాడారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టిన ఎన్టీఆర్, ప్రజల వద్దకే పాలనతో ప్రజలకు చేరువయ్యారని కీర్తించారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అనేది ఎన్టీఆర్ సిద్ధాంతమని, ఆయన ఆశయసాధనకు నేటి యువత ముందుకురావాలని నేతలు పిలుపిచ్చారు. జిల్లావ్యాప్తంగా గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా కార్యక్రమాలతో తెలుగుతమ్ముళ్లు సందడి చేశారు. సభలు, సమావేశాలతోపాటు పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు. శిబిరాల్లో రక్తదానం చేసినవారికి నాయకులు ధ్రువీకర ణపత్రాలు అందజేశారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమం జరిగింది. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు తరపున లోకేశ్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు.

# ప్రయాణానికి.. పాట్లే



- బస్సులన్నీ బెజవాడ సభకే
- ముఖ్యమంత్రి జగన్ సేవలో ఆర్టీసీ
- డిపోలకు లక్ష్యాలు నిర్దేశించి కేటాయింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 630 బస్సులు
- ఇక్కడవి సరిపడక తిరుపతి, నంద్యాల, నెల్లూరుల నుంచీ

బాపట్ల, జనవరి 18: సంక్రాంతి ముగిసింది.. సెలవులు అయిపోయాయి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పండుగ సంబరాల్లో మునిగి తేలి స్వస్థలాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ప్రయాణాలకు సిద్ధమైన వారికి ఆర్టీసీ షాక్ ఇచ్చింది. శుక్రవారం విజయవాడలో జరిగే సీఎం జగన్ సభకు జనసమీకరణకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే డిపోల్లో సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జనసమీకణకు బస్సులను వినియోగిస్తుండటంతో శుక్రవారం ప్రయాణికులు ఇక్కట్లు పడనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు జనాన్ని తరలించేందుకు ప్రభుత్వ పెద్దలు అడిగిందే తడువుగా ఆర్టీసీ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 630 బస్సులు సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తరలిస్తున్నారు. పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారు గమ్య స్థానాలకు చేరుకోవడానికి శుక్రవారమంతా బస్సులు ఉండవు. దీంతో బస్సులు లేక ప్రయాణం నరకప్రాయం కానున్నది. గుంటూరు-1, 2, పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 182 బస్సులను సిద్ధం చేస్తున్నారు. 122 ఇక్కడి బస్సులు కాగా మరో 60 బస్సులు తిరుపతి నుంచి తెప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని ఆరు డిపోల నుంచి 230 బస్సులను తరలిస్తున్నారు. ఇందులో పల్నాడు నుంచి 170 సర్వీసులు కాగా మరో 60 సర్వీసులు నంద్యాల నుంచి తెప్పిస్తున్నారు. బాపట్ల జిల్లాలో 220 బస్సులను సిద్ధం చేయగా ఇందులో నెల్లూరు, కాకినాడ నుంచి కూడా బస్సులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బాపట్ల జిల్లా పరిధిలోని ఒక్కో నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు 38 బస్సులను కేటాయించారు. వేమూరు నియోజకవర్గం నుంచి 39 బస్సుల్లో జనాన్ని తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 33 బస్సులను కేటాయించారు. ఆయా బస్సుల ద్వారా ఒక్కో నియోజవర్గం నుంచి 1419 మందిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. జన సమీకరణలను ఎమ్మెల్యేలు పర్యవేక్షిస్తున్నారు. వినుకొండ నుంచి డ్వాక్రా మహిళలను విజయవాడకు బస్సుల్లో తరలించే బాధ్యత వెలుగు సిబ్బందికి కేటాయించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సర్వీసులను గురువారం సాయంత్రానికి ఆయా ప్రాంతాలకు తరలించగా, స్థానిక డిపోల్లో ఉన్న సర్వీసులను శుక్రవారం ఉదయానికి నిర్ణీత ప్రాంతాలకు చేరుకునేలా సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

### కండీషన్‌లో ఉండాలి.. మర్యాదగా వ్యవహరించాలి

విజయవాడ సభకు పంపించే సర్వీసులు మంచి కండీషన్‌లో ఉండాలని ఇప్పటికే గ్యారేజ్ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సభకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండాలని ఆర్టీసీ పెద్దలు సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పండుగ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసుల లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అరకొరగా కండీషన్‌లో ఉన్న సర్వీసులను సభకు తరలించగా డొక్కు బస్సులను సామాన్య ప్రయాణికులకు అందుబాటులో ఉంచటం విమర్శలకు తావిస్తోంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సగానికి పైగా సీఎం సభకు తరలిస్తే సామాన్య ప్రయాణికులు గంటల తరబడి అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. కోసం అధికారులు కూడా నానా హైరానా పడుతున్నారు.

### నేడు వాహనాల దారి మళ్లింపు ఇలా..

**గుంటూరు:** విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా శుక్రవారం విజయవాడ మార్గంలో వాహనాలు దారి మళ్లిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. విగ్రహావిష్కరణ సభకు వెళ్లే, అత్యవసర వాహనాలకు ఈ మార్గంలో అనుమతి ఉంటుందన్నారు.

**బుడంపాడు జంక్షన్:** గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వెల్లటూరు జంక్షన్, అవనిగడ్డ, హనుమాన్ జంక్షన్ మీదగా వెళ్లాలి.

**బోయపాలెం జంక్షన్:** బాపట్ల వైపు వెళ్లే వాహనాలు బోయపాలెం, ప్రత్తిపాడు మీదగా వెళ్లాలి. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలు బోయపాలెం వద్ద సర్వీస్ రోడ్డు పక్కన నిలుపుకోవాలి.

**హైదరాబాద్ వైపు:** గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా వెళ్లాలి. విజయవాడ వైపు అనుమతిలేదు. చిలకలూరిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వారు గుంటూరు చుట్టుగుంట, పేరేచర్ల మీదగా వెళ్లాలి.

**మంగళగిరి వైపు:** మంగళగిరి నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు రేవేంద్రపాడు జంక్షన్ మీదగా తెనాలి, పెనుమూడి ఫ్లై ఓవర్ మీదగా వెళ్లాలి.

### ప్రైవేటు వాహనాలు కూడా..

విజయవాడలో సీఎం జగన్ సభకు పలు ప్రైవేటు వాహనాలను కూడా తరలిస్తున్నారు. పోలీసు, రవాణా అధికారులకు లక్ష్యాలు ఇచ్చి మరీ వాహనాలను ఏర్పాటు చేయిస్తున్నారు. దాచేపల్లిలో పలు ప్రైవేటు స్కూల్స్, కళాశాలల యాజమాన్యానికి రవాణాశాఖ, వైసీపీ నేతలు బస్సులు ఏర్పాటు చేయాలని ఫోన్ చేసి ఆదేశించినట్లు తెలిసింది. విద్యా సంస్థలకు సెలవు ఉన్నందున బస్సులు ఏర్పాటు చేయాలని యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. మాచర్లలో రెండు వార్డులకు ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యంతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి పాల్గొనే సభకు 200 వాహనాలు సమకూర్చాలని తెనాలి రవాణా శాఖకు టార్గెట్ పెట్టారు. ఒక్కో విద్యా సంస్థ 5 నుంచి 10 వాహనాలు పంపాలని అధికారులు ఆదేశించారు. వాహనాలు పంపకపోతే ఫిట్‌నెస్, లైసెన్స్‌ల రెన్యూవల్, కెపాసిటీ అంశాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనాలు పంపేందుకు యాజమాన్యాలు సిద్ధమైనట్లు సమాచారం.

# పంటలపై.. విషం

- రైతులపై బయోల పంజా
- నకిలీలతో కౌలు రైతుల దివాలా
- లేబుల్‌పై అడ్రస్‌లో కంపెనీలు కానరావు

గుంటూరు సిటీ, జనవరి 18: కోబ్రా అనేది భయంకరమైన విషం. అది తాకితే భూమి మీద నూకలు చెల్లుతాయి. ఇప్పుడు అదే పేరుతో చలామణి అవుతున్న బయో పురుగు మందులు కొన్ని పచ్చని పంటలను పాడుచేస్తున్నాయి. తయారీదారులు ఎవరో, ఎక్కడ ఉంటారో సరిగా తెలుసుకోకుండానే కొందరు ట్రేడర్లు వాటిని విక్రయించి కౌలు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. కోబ్రా పేరుతో మార్కెట్‌లో ఉన్న బయో మందుకు బలైన రైతులు చివరకు వినియోగదారులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ నకిలీ బయో మందు విరివిగా అమ్మకాలు జరిగినట్లు సమాచారం. కోబ్రా అనేది ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి ఊరు.. పేరు లేని బయో మందులు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 25 వేల కోట్ల వరకు జరిగే వ్యవసాయ ఆధారిత వ్యాపారంలో పురుగుమందులది అగ్రభాగం. అందులో బయో మందుల పేరిట జరుగుతున్న భారీ మోసానికి అన్నదాతలు నిలువునా బలవుతున్నారు. ఇంత మోసం ప్రత్యేకంగా జరుగుతున్నా ఏ ఒక్క శాఖకు చీమైనా కుట్టినట్లు ఉండకపోవటం విచారకరం. పత్రికలలో వార్తలు వచ్చినప్పుడో.. కలెక్టర్లు మండిపడినపుడో హడావుడి చేస్తున్న వ్యవసాయ శాఖ ఆతర్వాత చేష్టలుడిగి చూస్తున్నదనే విమర్శలున్నాయి. కళ్ల ముందే నకిలీ పురుగు మందులకు రైతులు బలవుతున్నా అధికారులకు పట్టకపోవడం శోచనీయం. బయో మందులను విక్రయిస్తున్న చాలా కంపెనీలు లేబుళ్లపై ముద్రించే అడ్రస్‌కు వెళ్తే అక్కడ ఎవరూ ఉండటం లేదు. గుంటూరు జిల్లాకు వస్తున్న బయో పురుగు మందులు అన్నీ తెలంగాణ రాష్ట్రం నుంచి వస్తున్నాయి. అక్కడ ఆయా జిల్లాల్లో అవి తయారైనట్లు చెబుతున్నా వాస్తవంగా యూనిట్లు అక్కడ ఉండటం లేదు. మార్కెట్‌లో మంచి పేరు కలిగిన బ్రాండ్లను లక్ష్యం చేసుకుని రైతులను బుట్టలో పడేస్తున్నారు. నకిలీ మందులను బ్రాండెడ్ లేబుళ్లతో చలామణి చేస్తున్నారు. తెలంగాణ నుంచి కొన్ని బయో మందులను తీసుకువచ్చి వాటికి లోకల్ బ్రాండ్లను తగిలిస్తున్నారు. ఈ రీతిగా మందులు విక్రయాలు జరిపే వారికి లైసెన్సులు కూడా ఉండటం లేదు. ఎటువంటి శాస్త్రీయ ఫార్ములేషన్ లేకుండా బయో మందులు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.

### నాడు రైతు.. నేడు డ్రైవర్

పల్నాడుకు చెందిన కౌలు రైతు జరుగుల ఆంజనేయులు కంది పంటను సాగుచేశారు. పొలంలో కొట్టేందుకు కోబ్రా పేరుతో ఉన్న బయో మందును కొనుగోలు చేశారు. లీటరు రూ.2400 చొప్పున మొత్తం రూ.లక్షకు మందును కొన్నారు. మందును పంటకు కొట్టిన తర్వాత అది పూర్తిగా పాడవుతున్నట్లు గుర్తించారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించారు. బయో మందు వల్లే పచ్చని పంట పాడైందని భావించి నష్టపరిహారం కోసం వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయస్థానం, రైతుకు రూ.9.40లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆ తర్వాత అసలు కథ మొదలైంది. బయోను విక్రయించిన ట్రేడర్ అసలు ఆ మందును ఎక్కడ తయారుచేశారో.. దాని యాజమాన్యం ఎక్కడ ఉంటుందో తనకు తెలియదని చేతులెత్తేశారు. వ్యాపారుల దగాతో నష్టపోయిన రైతు ప్రస్తుతం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.

ఆంజనేయులును నిలువునా ముంచిన కోబ్రా బయో మందు





వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంజాయిషీ అడుగుతున్న ఎంపీడీవో ప్రసాద్

# అవ్వకు పింఛన్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కంభం, జనవరి 18 : కంభానికి చెందిన కమల అనే వృద్ధురాలికి ఎట్టకేలకు పింఛన్ అందింది. వలంటీర్ గురువారం ఆమె ఇంటికి వెళ్లి రూ.3వేలు అందజేశారు. కంభం పంచాయతీ పరిధిలోని మేదరవీధిలో నివసించే తరిట కమల వృద్ధురాలు. ఆమె భర్త ఎనిమిది నెలల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి కమల తనకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. ఈ విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'అవ్వకు అవస్థ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో ప్రసాద్.. వలంటీర్‌ను, వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కార్యాలయానికి పిలిపించి సంజాయిషీ కోరారు. నూతన పింఛన్‌ల లిస్టులో వృద్ధురాలి పేరు ఉన్నట్లు వారు తెలిపారు. వలంటీర్ కుటుంబసభ్యులకు ఆరోగ్యం సరిగాలేక హైదరాబాద్ వెళ్లడంతో కమలకు సకాలంలో ఫించన్ ఇవ్వలేకపోయామన్నారు. ఆవెంటనే ఎంపీడీవో ఆదేశాల మేరకు వృద్ధురాలు కమల ఇంటికి వలంటీర్ వెళ్లి కమలకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఊరూవాడా వర్ధంతి కార్యక్రమాలు

పలుచోట్ల భారీగా అన్నదానాలు, రక్తదాన శిబిరాలు

ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు, ముఖ్యనేతలు

# మనసా స్మరామి

**మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావును జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా స్మరించుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీఎత్తున అన్నదానాలు, రక్తదానాలు, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు. అన్న ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు గురువారం అన్ని నియోజకవర్గాల్లో పెద్దఎత్తున జరిగాయి. ఊరూవాడా టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు భారీగా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య నేతలు, తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను కీర్తించారు. పేద ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ చిరస్మరణీయుడిగా ఉంటారని అన్నారు.**



ఒంగోలు అద్దంకిబస్టాండ్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, పార్లమెంట్ అధ్యక్షులు బాలాజీ తదితర నేతలు

ఒంగోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా గురువారం పెద్దఎత్తున జరిగాయి. ఏటా టీడీపీ శ్రేణులు భారీగా నిర్వహిస్తున్నా త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి మరింత జోరు కనిపించింది. ఆయా ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు పలు ప్రాంతాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్‌లు తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు బహిరంగ సభ నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లలో ఉన్నారు. దీంతో వారు గురువారం తిరుపతిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి హారతి ఇచ్చి నివాళులర్పించారు. ఇక జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పరిశీలిస్తే.. ఒంగోలులోని పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం, సభతోపాటు దాదాపు పదికిపైగా ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ తొలుత దామచర్ల జనార్దన్‌తో కలిసి ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండపి నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన టంగుటూరు సింగరాయకొండ, కొండపితోపాటు పలు గ్రామాల్లో టీడీపీ యువనేత దామచర్ల సత్య నేతృత్వంలో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కనిగిరితోపాటు మండల కేంద్రాలైన వెలిగండ్ల, సీఎస్ పురం, ఇతర పలు గ్రామాల్లో అక్కడి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. దర్శి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, గోరంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వైపాలెంతోపాటు పలు ఇతరచోట్ల ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు, కంభంలోనూ, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురంలోనూ పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.



మార్కాపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నేతలు



గిద్దలూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముత్తుముల





లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

# అర్హులందరికీ సొంత ఇళ్లు

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 18 : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. అందుకోసం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని త్వరగా నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ సందర్భంగా గురువారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకాశంభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 39,541 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35వేల చొప్పున రూ.139.30 కోట్ల మేర రుణాలను అందించినట్లు తెలిపారు. వీరిలో ప్రస్తుతం 11,141 మంది లబ్ధిదారులకు తొలి విడత రూ.1.18 కోట్ల వడ్డీ రీయింబర్స్ చేస్తున్నట్లు తెలిపారు. ఇలా సంవత్సరంలో రెండుసార్లు ఇస్తామన్నారు. జిల్లాలో 74వేల గృహాలను మంజూరు చేయగా, వాటిలో ఇప్పటి వరకు 24వేల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పేరయ్య, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కులగణన

● తహసీల్దార్లు, ఎంపీడీవోల నేతృత్వంలో ఏర్పాట్లు

● వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సర్వే

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18 : జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి కులగణన నుంచి ప్రారంభంకానుంది. అన్ని గ్రామాల్లోనూ కార్యక్రమ నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సచివాలయం యూనిట్‌గా సర్వే జరగనుంది. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు శుక్రవారం నుంచి ఈనెల 28వతేదీ వరకు ఇంటింటికీ తిరిగి కులాల వారీగా సమాచారాన్ని సేకరించనున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ముందుగా ఈసర్వే చేస్తారు. తమ పరిధిలో ఉన్న 50 కుటుంబాల వివరాలను వలంటీర్లు సేకరించిన అనంతరం సచివాలయ సిబ్బంది ఒక్కో గృహాన్ని సందర్శించి మరోసారి పరిశీలిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగనుంది. ఒక మండలంలో ఉన్న గ్రామ పంచాయతీల్లో సగం తహసీల్దార్లు, మరో సగం ఎంపీడీవోలకు కేటాయించారు. కులగణన సర్వేను పరిశీలనకు సూపర్‌వైజర్లతోపాటు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఈనెల 28వతేదీ నాటికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే చేసేలా చర్యలు తీసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆయా గృహాలకు వచ్చిన సమయంలో యజమానులు అందుబాటులో లేకపోతే తిరిగి ఈనెల 29వతేదీ నుంచి వచ్చేనెల 2వతేదీలోపు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కులగణన నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

## 21న పుస్తకావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 18 : గుంటూరులోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో ఈనెల 21 వ తేదీన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగాల సకలనం 'మండలిలో మాస్టారు' అనే పుస్తకావిష్కరణ ఉంటుందని జేవీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. ఒంగోలులోని జేవీవీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

# బస్సులన్నీ విజయవాడకే..!

ప్రయాణికులకు తప్పని తిప్పలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో పాల్గొనాలని పొదుపు మహిళలకు ఆదేశాలు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 18 : విజయవాడలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు ప్రభుత్వం చేస్తున్న హడావుడి జిల్లాలోని ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం కోసం ఈ కార్యక్రమానికి ప్రజలను తరలించడానికి 200కుపైగా ఆర్టీసీ బస్సులను కేటాయించింది. దీంతో అరకొరగా ఉన్న బస్సులతో ప్రయాణికులు తమ తమ ఊర్లకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. గంటల తరబడి ఆర్టీసి బస్టాండ్‌లో ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే నగరంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన బస్సులన్నింటినీ విగ్రహావిష్కరణ సభకు పంపాలని యాజమాన్యాలకు ఆదేశాలు అందాయి. మరోవైపు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సభ్యులంతా విజయవాడకు తరలిరావాల్సిందేనని అధికారులు హుకుం జారీ చేశారు. దీనిపై మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

# అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

● 38వ రోజుకు చేరిన సమ్మె

● రేపు రాస్తారోకోకు కార్మిక, ప్రజా సంఘాల పిలుపు

ఒంగోలు నగరం, జనవరి 18: అంగన్‌వాడీల ఆందోళన మరింత ఉధృతమవుతోంది. 38 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. అదేసమయంలో కార్యకర్తలు, ఆయాలకు మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నాయి. శనివారం పెద్దఎత్తున రాస్తారోకోలకు పిలుపునిచ్చాయి. స్థానిక ఏఐయూటీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ తదితరులు ఈ విషయాన్ని వెల్లడించారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ఎస్మాను ప్రయోగించడం పాలకుల నిరంకుశ ధోరణికి అద్దం పడుతున్నదన్నారు. దీన్ని ఖండిస్తూ ఆందోళనను ఉధృతం చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీలకు అండగా శనివారం జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు చేపడుతున్నట్లు చెప్పారు. పలు ప్రజా సంఘాలు కూడా కార్యక్రమంలో పాల్గొంటాయని వారు తెలిపారు. మరోవైపు అంగన్‌వాడీలు చేస్తున్న 24గంటల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. రాత్రి వేళల్లో కార్యకర్తలు, ఆయాలు శిబిరాల్లోనే నిద్రిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు వెనకడుగు వేసేదేలేదని స్పష్టం చేస్తున్నారు.

## సంక్రాంతి సెలవులు రెండు రోజులు పొడిగింపు

● 22 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఒంగోలు (విద్య), జనవరి 18 : పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించింది. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. అన్ని యాజమాన్యాల్లో నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తొలుత ఈనెల 9 నుంచి 18వతేదీ వరకూ పండుగ సెలవులు ప్రకటించారు. అయితే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈనెల 19, 20 తేదీల్లో కూడా సెలవులు ఇచ్చారు. 21న ఆదివారం కావడంతో స్కూళ్లు ఈనెల 22నుంచి పునఃప్రారంభమవుతాయి.

# బుర్రా అవుట్.. కనిగిరి నుంచి దద్దాలకు అవకాశం

మార్కాపురంలో పోటీ చేయలేమన్న శిద్దా..

జంకెకు ఫైనాన్స్ సమస్య

మార్కాపురంలో నాగార్జునరెడ్డికే చాన్స్

కందుకూరు విషయంలో సందిగ్ధం

మహీధర్‌రెడ్డి వైపే మొగ్గు

గిద్దలూరుకు స్థానిక నేత పేరు పరిశీలన

ఎంపీగా ముందుకొచ్చిన సత్యనారాయణరెడ్డి పేరు

ఒంగోలు సీటు బాలినేనికే.. 22న ర్యాలీ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీలో అభ్యర్థుల ఎంపిక వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌నుపక్కనపెట్టేశారు. ఆయన స్థానంలో అసమ్మతి నేత, హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణయాదవ్‌కు అవకాశం ఇచ్చారు. మరికొన్ని మార్పులు, చేర్పులపై పరిశీలన అనంతరం మార్కాపురం, కందుకూరుల్లో సిటింగ్ ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, మానుగుంట మహీధరరెడ్డిలకు అవకాశాలు మెరుగుపడ్డాయి. భూసేకరణకు అవసరమైన నిధులు రాబట్టుకున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి తిరిగి ఒంగోలులో పోటీకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. గిద్దలూరులో రెడ్డి సామాజికవర్గానికి చెందిన స్థానిక నేతకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ స్థానానికి ఎంపీ మాగుంటను కాదనుకున్న జగన్.. రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకున్నారు. శుక్ర, శనివారాల్లో తుది జాబితా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.



బుర్రా మధుసూదన్‌యాదవ్

### బుర్రాకు నోచాన్స్

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌కు టికెట్ ఖాయమని నిన్న మొన్నటివరకూ చెప్పిన జగన్ గురువారం సాయంత్రం నిర్ణయాన్ని మార్చుకున్నారు. తొలుత బుర్రాతో మాట్లాడిన సీఎం.. 'మీకు నియోజకవర్గంలో అసమ్మతినేతలు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. తాజా సర్వే నివేదికలు కూడా మీకు వ్యతిరేకంగా వచ్చాయి. అందువల్ల మిమ్మల్ని తప్పించక తప్పడం లేదు' అని చెప్పినట్లు తెలిసింది. వెంటనే బుర్రా ఏదో చెప్పుకోబోగా వేచి ఉండండి ఇతరత్రా అవకాశాలు చూస్తామని చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్యే బుర్రా వ్యతిరేకవర్గంలో ఉన్న దద్దాల నారాయణయాదవ్‌ను పిలిచి వెళ్లి పనిచేసుకోండని ఆదేశించారు. ఆమేరకు నారాయణ పేరును ఖరారు చేస్తూ జాబితా ప్రకటించాలని కూడా విజయసాయిరెడ్డిని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. తొలుత బుర్రాతో జగన్ మాట్లాడిన సమయంలో కందుకూరు లేక మరో నియోజకవర్గానికి వెళ్తారా? అని అడిగితే ఆయన ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు బుర్రా వియ్యంకుడైన కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని కూడా ఇటీవల పెనమలూరు నుంచి జగన్ తప్పించిన విషయం తెలిసిందే.



దద్దాల నారాయణయాదవ్

ఆయన టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో కనిగిరి నుంచి బుర్రాను తప్పించడం పలురకాల అనుమానాలకు తెరలేపింది.

### మార్కాపురం నుంచి నాగార్జునరెడ్డికే అవకాశం



వివిధ రకాల పరిణామాల అనంతరం మార్కాపురం టికెట్‌ను తిరిగి సిటింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికే ఖరారు చేసినట్లు తెలిసింది. తొలుత మాజీ ఎమ్మెల్యే జంకె పేరును పరిశీలించినప్పటికీ ఆయన ఆర్థికంగా తూగలేరని తెలిశాక పక్కనబెట్టారు. బుధవారం బాలినేని మార్కాపురంనకు మాజీమంత్రి శిద్దా రాఘవరావు లేక ఆయన కుమారుడు సుధీర్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం జగన్ అంగీకరించడంతో సుధీర్‌ను బాలినేని విజయవాడ పిలిపించుకుని మాట్లాడారు. అయితే దర్శి మినహా ఎక్కడా పోటీచేయలేమని సుధీర్ తేల్చిచెప్పి సీఎం వద్దకు వెళ్లకుండానే వెనక్కు వచ్చేశారు. ఈ విషయమై జగన్‌కు బాలినేని సమాచారం పంపారు. గురువారం సాయంత్రం నాగార్జునరెడ్డి సీఎం జగన్‌ను కలవగా 'మీరు జాగ్రత్తగా పనిచేసుకోండి. అందర్నీ కలుపుకు పోండి. ముఖ్యంగా జంకె వెంకటరెడ్డితో కలిసి నడవాల్సిందే' అని చెప్పినట్లు తెలిసింది. నాగార్జునరెడ్డి కూడా తాను స్వయంగా వెళ్లి ఆయన్ను కలుస్తానని చెప్పి వచ్చారు. దీంతో నాగార్జునరెడ్డికి అవకాశాలు తిరిగి మెరుగుపడ్డాయి



### మహీధరరెడ్డితో భేటీ

కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఒకదశలో బొట్ల రామారావు పేరును పరిశీలనలోకి తీసుకున్న జగన్ తాజాగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రాను కందుకూరుకు మార్చాలని భావించారు. బుర్రా అందుకు సిద్ధపడకపోగా, మహీధర్‌రెడ్డి కోసం నెల్లూరు ఎంపీగా పోటీచేయబోతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గట్టిగా పట్టుబట్టినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మహీధర్‌రెడ్డితో సీఎం.. 'పరిస్థితులు ఎలా ఉన్నాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ ఆలోచనాధోరణిపై మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగినట్లు తెలిసింది. ఆతర్వాత రెండురోజుల్లో సముచిత నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా అభ్యంతరం లేదని మహీధర్‌రెడ్డి కూడా సూటిగానే ఆయనతో చెప్పారు. అయితే మానుగుంట వైపే జగన్ మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

### గిద్దలూరుపై సస్పెన్స్

గిద్దలూరు అభ్యర్థి ఎంపికపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బాలినేని ఒంగోలు నుంచే తిరిగి పోటీచేయటం ఖాయమవడంతో అక్కడ రెడ్డి సామాజికవర్గానికి చెందిన మరో నాయకుడిని రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితర కొన్ని పేర్లు పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. అయితే రెడ్డి సామాజికవర్గంలోనే స్థానికుడికి అవకాశం ఇవ్వాలన్న భావనకు వచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే రాంబాబుపై అసమ్మతిబావుటా ఎగురవేసిన రమణారెడ్డితోపాటు మరో ఒకట్రెండు పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా సత్యనారాయణరెడ్డి పేరు పరిశీలన

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని పక్కనపెట్టిన జగన్.. రెడ్డి సామాజికవర్గం వారికే అవకాశం ఇవ్వాలన్న తన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీచేయాలని ఆశించినప్పటికీ స్థానిక నాయకుల నుంచి సానుకూలత రాలేదని సమాచారం. దీంతో కనిగిరికి చెందిన రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం.

### ఒంగోలు నుంచే బాలినేని



ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అడిగిన నివేశన స్థలాలకు అవసరమైన భూసేకరణ కోసం రూ.180 కోట్ల విడుదలకు గురువారం మధ్యాహ్నం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. బుధవారం సాయంత్రమే మౌలిక సదుపాయాల కల్పనకు రూ.21 కోట్లను కలెక్టర్ మంజూరు చేశారు. దీంతో తాను ఒంగోలులోనే పోటీచేస్తానని సీఎం జగన్‌కు బాలినేని చెప్పినట్లు తెలిసింది. ఆమేరకు సోమవారం ఒంగోలులో పేదలపక్షపాతి బాలినేని అనే పేరుతో ర్యాలీ నిర్వహణకు ఆయన అనుచరులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లిన బాలినేని సోమవారం ఒంగోలు రానున్నారు.


చీరాల: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కొండయ్య


మార్టూరు: ఏలూరి క్యాంపు కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

# యుగపురుషుడు.. ఎన్టీఆర్

» పలుచోట్ల నివాళులు » భారీగా అన్నదానం, సేవాకార్యక్రమాలు » టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

చీరాల, జనవరి 18: పార్టీ స్థాపించిన 9 నెలల వ్యవధిలోని ముఖ్యమంత్రిగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు యుగపురుషుడని, సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయునిగా ప్రజల మదిలో ఉంటారని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్యా అన్నారు. ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డేటా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కొండయ్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జరిగిన పాలనకు ఎన్టీఆర్ ఆద్యులని అన్నారు. సీఎం జగన్ చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండదన్నారు. తల్లి, చెల్లిని పక్కన పెట్టిన ఆ పెద్దమనిషి రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనకు చరమగీతం పాడి, తిరిగి రామరాజ్యం రావాలంటే టీడీపీ గెలుపు, చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం అనివార్యమన్నారు. సభ అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పొగడదండ రవికుమార్, గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తమ్, నాశిక వీరభద్రయ్య, వంకా హరికృష్ణ, శ్రీనివాసతేజ, ఉసురుపాటి సురేష్, సయ్యద్‌బాబు, కారంపూడి పద్మిని, కర్పూరపు సుబ్బల క్ష్మి, బుర్ర కవిత, యర్రా శివనాగమల్లేశ్వరి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల మండలం ఈపురుపాలెం, రామకృష్ణాపురం, చీరాలనగర్ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం మండలం రావూరిపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఆపార్టీ చీరాల నియోజకవర్గ బాధ్యుడు ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు), టీడీపీ నాయకులు నాశిక వీరభద్రయ్య, కర్ణ శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మార్టూరులో..** మార్టూరు, జనవరి 18: ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు శివరాత్రి శ్రీను, శానంపూడి చిరంజీవి, షేక్ ఫరూక్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, మండల కాంప్లెక్స్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మార్టూరులోని పార్టీ కార్యాలయం వద్ద తెలుగు మహిళలు ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, రావినేని శ్రీనివాసరావు, జెట్టి శివ, కామినేని జనార్దన్, షేక్ ఫరూక్, జంపని సాంబశివరావు, ముప్వా సాంబయ్య, తేలప్రోలు సాంబశివరావు, ఉప్పుటూరి రమాదేవి, పున్నారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మార్టూరులో బొడ్డురాయి సెంటరు వద్ద కమ్మ శివ నాగేశ్వరరావు, చల్లగుండ్ల సుబ్బారావు తదితరులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, తెలుగు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులకు అన్న సంతర్పణ చేశారు. బొబ్బేపల్లి, రాజుగారిపాలెం, ద్రోణాదుల, ఇసుకదర్శి, రాజుపాలెం, నాగరాజుపల్లి, తదితర గ్రామాలలో పార్టీ అభిమానులు ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. వలపర్ల గ్రామంలో సెంటరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, జంజనం సుబ్బారావు, వెలగా రామాంజనేయులు, షేక్ బషీర్, సయ్యద్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డేగరమూడి గ్రామంలో ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు.

యద్దనపూడి మండలంలో యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, పూనూరు, మున్నంగి వారిపాలెం, అనంతవరం, పోలూరు తదితర గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల కూడలిల వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో కనపర్తి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, బోయపాటి సాంబయ్య, రావినేని సీతయ్య, గుదే తారక రామారావు, కొరటాల వంశీ, కోయ సతీష్, పూనూరు వాసు తదితరులు పాల్గొన్నారు.


పర్చూరు: కారంచేడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


మేదరమెట్ల: రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

## ఎన్టీఆర్‌పై వెల్లువెత్తిన అభిమానం

పర్చూరు, జనవరి 18: ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అడుసుమల్లి, నాగులపాలెం, చెరుకూరు, బోడవాడ, వీరన్నపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, కోడూరి శేషబ్రహ్మాచారి, దూళ్ళిపాల్లి వెంకటస్వామి, చిట్టినేని రామకృష్ణ, మానం హరిబాబు, కొల్లా శివరాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు): స్వర్గీయ నందమూరి తారక రామరావు 28వ వర్ధంతి వేడుకలు కారంచేడు మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాల్వసెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీస్థాయిలో అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, కసిమ్, రావి శానయ్య, రావి వీరయ్యచౌదరి, పాతూరి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కారంచేడులోని తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్వర్యంలో కాల్వసెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యార్లగడ్డ నాగేశ్వరరావు, జాగర్లమూడి ప్రహ్లాదరావు, మండలపు సుబ్బారావు, చాగంటి లక్ష్మీనారాయణ, చాగంటి కోటేశ్వరరావు, దగ్గుబాటి చౌదరి, నల్లగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కుంకలమర్రు గ్రామంలో పార్టీ నాయకులు కొల్లా సుబ్బారాయుడు, టి.బంగారుబాబు, రాఘవయ్య, రవి, శివరాం, యోహాన్, ప్రకాశం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఇంకొల్లులో..** ఇంకొల్లు, జనవరి 18: మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిచారు. గంగవరం, నక్కలపాలెం, ఇడుపులపాడు గ్రామాలలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకొల్లులోని మండల పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం గ్రామంలో ర్యాలీగా నాగులచెరువు కట్టవద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాలేరు రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు వలేరు మార్కు, వీరగంధం అంజనేయులు, చెరుకూరి రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, హనుమయ్య, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

**చినగంజాంలో..** చినగంజాం: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడుతూ తెలుగుజాతి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

అద్దంకి, జనవరి 18: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సంక్షేమ పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కాకానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో పేద మహిళా కళాకారిణిని సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఎన్టీఆర్ రారాజుగా వెలుగొందారన్నారు. కార్య క్రమంలో నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, తెలుగుయువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, జిల్లా టీడీపీ లీ గల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, గోరంట్ల లక్ష్మణదాసు, కాకాని అశోక్, కుందారపు రామారావు, భోజనపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి కార్య క్రమాలు నిర్వహించారు. చక్రాయపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోగులమూడి రాజశేఖర్, నరేంద్ర, సుబ్బారావు, సత్యం, కోటయ్య, వెంకటరావు తదితరులు పా ల్గొన్నారు.


అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అలాగే, అద్దంకి మండలంలోని పలు గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, తిమ్మాయపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మాయపాలెంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాస్, బండారు రాఘవ, గణపతి, నూతి ప్రసాద్, అడుసుమల్లి శ్రీనివాసరావు, పరిటాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పుట్టావారిపాలెం అడ్డరోడ్డు, కామేపల్లి, వెల్లలచెరువు, ఏల్చూరు, కొమ్మాలపాడు, మామిళ్ళపల్లి, కుందుర్రు, పరిటాలవారిపాలెం, మక్కెనవారిపాలెం, సజ్జాపురం, కొప్పరం, బండివారిపాలెం, పత్తేపురం, మిన్నెకల్లు, తంగేడుమల్లి, చవిటిపాలెం, గురిజేపల్లి, పాతమాగులూరు, సంతమాగులూరు గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

**బల్లికురవలో..** బల్లికురవ, జనవరి18: మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, ఉప్పమాగులూరు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, గొర్రెపాడు, గంగపాలెం, కొప్పెరపాలెం తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయిల్, మలినేని గోవిందరావు, అమరనేని కాశీవిశ్వనాధం, పరుసు ప్రసాద్, చింతల రామారావు, పత్తిపాటి వెంకటరావు, ఏల్చూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**పంగులూరులో..** పంగులూరు: ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. జాగర్లమూడివారిపాలెం, పంగులూరు, కొండమంజులూరు, చందలూరు తదితర గ్రామాలలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రావూరి రమేష్‌చౌదరి బాబు, జాగర్లమూడి వెంకట్రావు, శ్రీకాంత్, జాగర్లమూడి పూర్ణచంద్రరావు, తెలగతోటి రాధ, తదితరులు పాల్గొన్నారు.

**మేదరమెట్లలో..** మేదరమెట్ల: ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గురువారం మేదరమెట్లలో ఎన్టీఆర్ దంపతుల చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు మన్నె రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నాటి పూర్ణచంద్రరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బొల్లేపల్లి సుబ్బారావు, శేషయ్య తదితరులు కూడా నివాళులర్పించారు. దాదాపు 4 వేలకు మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కారుసాల నాగేశ్వరరావు(బాబు) , మోపర్తి లక్ష్మీనారాయణ, కారుసాల గురుబాబు, కారుసాల సుబ్బయ్య, అనుబ్రోలు కస్తూరి, తదితరులు పాల్గొన్నారు. పమిడిపాడు శివారు కనగాలవారిపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


అన్నంబొట్లవారిపాలెంలో పోటీలో తలపడుతున్న ఎడ్లు

## హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 18: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన 36వ జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్థానిక గోరంట్ల రత్తయ్య చౌదరిక మెమోరియల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన పోలురాధ ఎడ్ల బలప్రదర్శనలో వివిధ ప్రాంతాల నుండి 22 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావటంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

## వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

చినగంజాం, జనవరి 18: రొయ్యల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అవనిగడ్డ రాములు(68) గ్రామ సమీపంలోని వాగులో రొయ్యలు పట్టుకునేందుకు గురువారం ఉదయం వెళ్లాడు. రొయ్యల వేటచేసే సమయంలో రాములు వాగులో పడిపోయాడు. వాగులో వేట చేస్తున్న గ్రామానికి చెందిన మత్స్యకారులు గమనించి రాములును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని వీఆర్వో కొమ్ము మోహనరావు, గ్రామ మత్స్యశాఖ సహాయకురాలు డి.ప్రతిభ పరిశీలించారు. వేట సమయంలో గుండెపోటుకు గురై మృతి చెంది ఉండవచ్చునని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కుటుంబసభ్యులు నిరాకరించారు.





# సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

» ప్రయాణికులకు తప్పని తిప్పలు

అద్దంకి, జనవరి 18: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం జగన్మోహనరెడ్డి హాజరయ్యే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈక్రమంలో అద్దంకి డిపో నుంచి 25 ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేశారు. డిపోలో 40 బస్సులు ఉండగా, అందులో 25 పల్లె వెలుగు బస్సులను గురువారం సాయంత్రం నుంచే రద్దు చేశారు. బాపట్ల, చీరాల తదితర ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు ఆయా గ్రామాలకు ఈ బస్సులను పంపినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. దీంతో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల బస్ సర్వీసులు రద్దు అయ్యాయి. అద్దె బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఆయా రూట్లలో నడిచాయి. బస్సులు రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రకటించకపోవటంతో వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి అద్దంకి వచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్లేందుకు నానాఅవస్థలు పడ్డారు. గత్యంతరం లేక ఆటోలు, ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించారు. శుక్రవారం కూడా అత్యధిక రూట్లలో బస్సులు నడిచే అవకాశం లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు.


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

వేటపాలెం(చీరాల), జనవరి 18: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ మహాలక్ష్మి అమ్మవారి చెట్టు సెంటర్లో టీడీపీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను, అరాచక పాలనతీరును ఎండగట్టారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారధి, నిమ్మల పిచ్చయ్య, నాశిక వీరభద్రయ్య, యర్రా శివనాగమల్లేశ్వరి, పోలయ్య, వెంగళభరత్, కోటేశ్వరరావు, సుబ్బారావు, లాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములుకు నివాళులర్పించిన కృష్ణచైతన్య

అద్దంకి, జనవరి 18: పట్టణంలోని కాకానిపాలెంలో సందిరెడ్డి శ్రీరాములు(85) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతదేహం వద్ద శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీరాములుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు నివాళులు అర్పించారు.

## కనుల పండుగగా రథోత్సవం

చీరాల, జనవరి 18: పేరాలలో వేంచేసియున్న శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి రథోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామి రథోత్సవం సాగింది.

## యంపరాల సచివాలయం తనిఖీ

అద్దంకిటౌన్, జనవరి 18: మండలంలోని యంపరాల గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జ్ డీపీవో రాంబాబు గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రేడ్ 5 అధికారులు లేకపోవడాన్ని ప్రశ్నించారు. తడి, పొడి చెత్తకు సంబంధించిన బుట్టలు గ్రామంలో పంచకుండా సచివాలయంలో ఉండడాన్ని పంచాయతీ సెక్రటరీని ప్రశ్నించారు.

## చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

చీరాలటౌన్, జనవరి 18: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఓవర్గాన్ని అవహేళన చేస్తూ దూషణకు పాల్పడిన ఇద్దరిని ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గవిని అయ్యప్పను బుధవారం ఉదయం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై జనార్దన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి


» 38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

చినగంజాం, జనవరి 18: ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆందోళన నిర్వహించారు. గత 38 రోజులుగా న్యాయమైన కోర్కెల సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తూ ధైర్యంగా ముందుకు వెళ్ళాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు భయపడొద్దని, చివరికి విజయం మీదేనన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, ఆయాలు మోకాళ్ళపై కూర్చొని దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల నాయకులు ఎ.హైమావతి, పి.జయలక్ష్మి, కె.రంగనాయకమ్మ, కె.యానాదమ్మ పాల్గొన్నారు.

**ఐకమత్యంగా సాగుదాం..**

చీరాల, జనవరి 18: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా సాగుదామని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ ధోరణిని విడనాడే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.వసంతరావు, ఎన్.బాబూరావు, ప్రమీల, సుజీవన, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం మండల కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, జాష్టి సాంబశివరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తగెడ్ల ఆంజనేయులు, షేక్ రజాక్, షేక్ ఫరూక్, ఉప్పలపాటి అచ్చిరాజు, పెంట్యాల శ్రీను, తొండెపు ఆదినారాయణ, జనసేన నాయకులు రామిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చినగంజాం: మోకాళ్ళపై కూర్చొని దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

బల్లికురవ: తమ న్యాయపరమైన కోర్కెలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకుండా ఎస్మా చట్టంతో బెదిరింపులకు గురిచేస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, శ్రీదేవి, అనురాధ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్, జనవరి 18: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతి రెడ్డి, జి.శారద, మనోలత, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

## 22 మంది సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

చీరాల, జనవరి 18: సెయింట్‌ఆన్స్ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమా 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ వాలియో ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.16 వేలు స్టైఫండ్, ఉచిత భోజన, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.విజయభాస్కరరెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు

చీరాల, జనవరి 18: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా అంతర్జాతీయంగా ఉద్యోగ అవకాశాలకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335, 85559 01198 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## అభివృద్ధిపై ముందస్తు ప్రణాళిక అవసరం

చినగంజాం, జనవరి 18: గ్రామాల్లో అభివృద్ధిపై ముందస్తు ప్రణాళికలు అవసరమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలోని సమావేశపు హాల్‌లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీవిధానం 2024-2025పై గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను అమలు పరుచుటద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చునని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నారు. గ్రామ పంచాయతీల్లో ఆర్థిక వనరులను ఏవిధంగా వినియోగించుకోవాలి, నిధుల ప్రాధాన్యత తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమంలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఏపీఎం కె.అంజిబాబు, ఏపీవో లక్ష్మీదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ కమిటీలు

మార్టూరు, జనవరి 18: మార్టూరులోని విజయలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల స్థాయి నూతన కమిటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడుగుంట లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ ఆదేశాలకు అనుగుణంగా మండల స్థాయిలో నూతన కమిటీలు ఎంపిక కోసం సమావేశం ఏర్పాటుచేసినట్టు చెప్పారు. బొంతా దాస్ మాదిగ మాట్లాడుతూ నూతన కమిటీలు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో వంగేవరపు రమేష్, ఇంద్రాజుపల్లి సు బ్బారావు, దుడ్డు వందనం, ఎస్.ఆదాం, డి.నాగేశ్వరరావు, శేఖరబాబు, సర్దార్ పాపారాయుడు, మాదుగుల కిషోర్, అమర్తలూరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

అడుసుమల్లి(పర్చూరు), జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ స్వీట్స్ బాక్స్, నూతన సంవత్సర క్యాలెండర్‌తోపాటు, పథకాల బ్రోచర్‌ను గృహాలకు అంటిస్తూ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, చిట్టినేని రామకృష్ణ, మానం హరిబాబు, కారుమంచి కృష్ణ, అడ్డగడ్డ వేణుబాబు, నాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





**సడలని పోరు**

అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ఆత్మకూరులో ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను చూపుతూ ఆందోళన వ్యక్తం చేశారు.

**• టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘన నివాళి**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావునుకు జిల్లాలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘననివాళులర్పించారు. ఎన్టీఆర్ 28వ వర్థంతి సందర్భంగా గురువారం రామారావు చిత్రపటానికి, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. చాలాచోట్ల ఆసుపత్రులలో పండ్లు, బ్రెడ్లు, కాలనీల్లో అన్నదానాలు, వస్త్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు జాతి గౌరవం కోసం ఎన్టీఆర్ చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నెల్లూరు : టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నారాయణ, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

**● అన్నా స్మరామి!**



గుడ్లూరు : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

# ఊరెక్కడ బాగుపడిందన్నా..!?

**ప్రకటనల హోరు.. వసతులు లేక పల్లెల బేజారు**

**ఐదేళ్ల క్రితం వేసిన రోడ్లే దిక్కు**

**జగనన్న పాలనలో పల్లె బాధలు అన్నీ ఇన్నీ కావు!**

ఆంధ్రజ్యోతి పరిశీలన



మట్టి రోడ్డుగా మారిన సిరిపురం తారు రోడ్డు

'ప్రతి పల్లెలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పాల సేకరణ కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, నాడు- నేడు పథకం కింద స్కూలు బాగు చేశాం.' ఇలా జగన్ హయాంలో 'ఊరు మారింది.' అంటూ ప్రభుత్వం ఊదరగొడుతోంది. ఐదేళ్ల జగన్ పాలనలో ఊరు మారిపోయిందంటూ ఇటీవల ప్రభుత్వ పెద్దన్న సొంత పత్రికలో గొప్పలు చెప్పుకుంది. ఈ అందమైన ప్రకటన చూసిన పట్టణవాసులు ఔరా..!! ఐదేళ్ల కాలంలో పల్లెలు ఇంతగా బాగుపడ్డాయా!? అని ఆశ్చర్యపోయారు. అయితే పల్లెల్లో పర్యటిస్తే అలాంటి దృశ్యాలు ఏవీ కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో ప్రకటనలో పేర్కొన్న ఆరు భవనాల నిర్మాణాలు పునాదుల దశను కూడా దాటలేదు. డిజిటల్ లైబ్రరీల ఊసేలేదు. కొన్ని గ్రామాల్లో ఒకటి రెండు కట్టినా, బిల్లులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు నిర్మాణాలు పూర్తయినా వాటి తాళాలు ఇవ్వలేదు. చాలా గ్రామాల్లో స్కూళ్లు బాగుపడలేదు. గుంతల రోడ్లు అలాగే ఉన్నాయి. మురుగు పేరుకుపోయి కాలువలు కంపుకొడుతున్నాయి. పక్కా ఇళ్లు నిర్మించలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామానికి అవసరమైన ఏ మౌలిక సదుపాయం కూడా మెరుగుపడలేదు. ఊరు బాగుపడిందా..!? అని తెలుసుకోవడానికి ఆంధ్రజ్యోతి కొన్ని గ్రామాలను సందర్శిస్తే వింత గొలిపే ఎన్నో నిజాలు వెలుగుచూశాయి. పల్లెల అభివృద్ధి ప్రభుత్వ పెద్దన్న సొంత మీడియాలో మాత్రమే కనిపిస్తోందనే జనవాక్యం వినిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి బృందం

## పేరుకే 'సిరి'పురం

కావలి : కావలి రూరల్ మండలం సిరిపురం పంచాయతీలో పలు విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పంచాయతీలో 414 గృహాలు, సుమారు 1,700 మంది జనాభా ఉంది. గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. సచివాయం నిర్మించే కాంట్రాక్టర్లు ఇప్పటికి ఇద్దరు మారారు. చివరకు దానికి శ్లాబులు పోసి వదిలేయడంతో దిష్టిబొమ్మలా మారింది. ఇక విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి 'ఫినిషింగ్ టచ్' కరువయ్యింది. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ అయిన వైసీపీ నాయకుడే భవనానికి తాళం వేశారు. రైతుభరోసా కేంద్రం మాత్రం వినియోగంలో ఉన్నా, దానికి తాళం వేసి ఉన్నారే కానీ ఎవరూ ఉండటంలేదు. పైగా నిర్మించిన కొన్నాళ్లకే కిటికీల అద్దాలు పగిలి పోయాయి. ఇక గ్రామంలో అభివృద్ధి సంగతికి వస్తే టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్లు తప్ప ఈ ప్రభుత్వంలో తట్టెడు మట్టి కూడా వేసిన పాపాన పోలేదు. ప్రధాన తారురోడ్డు మట్టి రోడ్డుగా మారిపోయింది. గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు ఎక్కువగా ఉంటున్నా పక్కా ఇళ్లు కరువయ్యాయి. ఇక నాడు-నేడు కింద పాత పాఠశాల భవనానికి రంగులు వేశారేకాని కొత్త భవనం ఒక్కటి కూడా నిర్మించలేదు.



ఆత్మకూరు : పునాదులకే పరిమితమైన సచివాలయ కేంద్రం

## అభివృద్ధికి దూరంగా 'వాశిలి'

ఆత్మకూరు : మండలంలోని వాశిలి గ్రామంలో 700 కుటుంబాలు ఉండగా, 2,500 మందికి పైబడి జనాభా ఉన్నారు. నాలుగున్నరేళ్లగా అభివృద్ధికి నోచుకున్న దాఖలాలు లేవు. ఎఫ్‌డీఆర్ నిధులతో కట్ట కింద పొలాలకు వెళ్లే రోడ్డు, సచివాలయం నిధులు రూ.20 లక్షలతో పడమటి హరిజనవాడ, తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఎస్సీ కాలనీలో పైపులైను, ఎస్టీ కాలనీలో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేశారు. అంతకు మించి అభివృద్ధి లేదు. బస్టాండ్ సెంటర్ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు కళావిహీనంగా ఉన్నాయి. ప్రహరీలు లేక ముళ్ల కంచెతో కాలం వెళ్లదీస్తున్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం నాడు- నేడు కింద 88.99 లక్షలు మంజూరైనా పనులు మాత్రం సాగడం లేదు. అదనపు తరగతి గదుల నిర్మాణం పునాదుల్లోనే ఉన్నాయి. పాఠశాల భవనానికి కనీసం రంగులు వేసిన దాఖలాలు లేవు. గ్రామ సచివాలయానికి రూ.35 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి 21.80 లక్షలు మంజూరైనా పనులు సైతం పునాదులు దాట లేదు. సచివాలయ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. డిజిటల్ కేంద్రం ఊసే లేదు.

## దుస్థితిలో కొండాయపాళెం

ఉదయగిరి రూరల్ : మండలంలోని కొండాయపాళెం పంచాయతీలో ఏడు గ్రామాలు, ఎస్సీ, బీసీ కాలనీలు ఉండగా, 3,175 మంది జనాభా ఉన్నారు. వైసీపీ హయాంలో ఏ గ్రామం అభివృద్ధికి నోచుకొన్న దాఖలాలులేవు. సీసీ రోడ్లు లేవు. గుంతలమయమైన రహదారులు, కాలువలు లేక రోడ్లపై పారుతున్న మురుగుతో ప్రజలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. కాలనీలు, గ్రామాల్లో వెలగని వీధిదీపాలు, ఏపుగా పెరిగిన చిల్లచెట్లతో విషపురుగులు బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గానుగపెంటపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించగా పాల కేంద్రం పునాది దశలో ఉంది. డిజిటల్ లైబ్రరీ ఊసే లేదు. పంచాయతీ పరిధిలోని మాసాయిపేట, దుర్గంపల్లి, కొండాయపాళెంలలో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మాసాయిపేటలోని అంగన్‌వాడీ కేంద్రం గేదెలకు ఆసరాగా మారింది. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో నాడు-నేడు పథకం కింద స్కూళ్లలో చేపట్టిన పనులు నత్తతో పోటీ పడుతున్నాయి.



గంగిరెడ్డిపల్లిలో రోడ్డుపైనే మురుగు



కావలి : అర్థంతరంగా ఆగిన సచివాలయ భవన నిర్మాణం



ఉదయగిరి : గుంతలమయంగా మాసాయిపేట రహదారి



ఆత్మకూరు : వాశిలిలో అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి

# రా.. కదలిరా!

**నేడు వెంకటగిరిలో టీడీపీ భారీ సభ ● 1.2 లక్షల మంది జనసమీకరణకు కసరత్తు**

వెంకటగిరి/తిరుపతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం వెంకటగిరి రానున్నారు. వెంకటగిరిలో రా కదలి రా... పేరిట నిర్వహిస్తున్న భారీ బహిరంగసభలో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. దీనికోసం శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు వెంకటగిరి పట్టణం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వున్న విశ్వోదయా గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచీ రోడ్డు మార్గాన 10.45 గంటలకు అక్కడి ఎస్‌ఆర్‌ఎల్ కన్వెన్షన్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి చేరుకుంటారు. సభలో మధ్యాహ్నం 12.15 గంటల వరకూ పాల్గొంటారు. శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు హెలిపాడ్ నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి కడప జిల్లా కమలాపురం వెళతారు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగసభలో పాల్గొని అక్కడ నుంచీ ఉండవల్లి వెనుదిరుగుతారు.



చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

**● 1.2 లక్షల మంది జనసమీకరణ**

వెంకటగిరి సభకు 1.20 లక్షల మంది జనాన్ని సమీకరించాలని పార్టీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈనెల 9వ తేదీననే వెంకటగిరిలో చంద్రబాబు బహిరంగసభ నిర్వహించాల్సి వుండింది. అయితే కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అదే తేదీన విజయవాడకు రావడంతో బహిరంగసభ వాయిదా పడింది. హఠాత్తుగా ఆయన పర్యటన వాయిదా పడడంతో పార్టీ నేతలు, శ్రేణులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అయితే ఎక్కువ వ్యవధి తీసుకోకుండా అధినేత పర్యటన పది రోజుల్లోనే ఖరారుకావడంతో రెట్టించిన ఉత్సాహంతో పార్టీ నేతలు, శ్రేణులు తిరిగి ఏర్పాట్లకు దిగారు. ఇతర జిల్లాలకు దీటుగా వెంకటగిరి సభకు జనసమీకరణ జరపాలని జిల్లా పార్టీ నేతలు నిర్ణయించారు. తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి తదితర ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచీ భారీగా జనాన్ని సమీకరించాలని నిశ్చయించారు. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ గరిష్ఠంగా 40 వేల నుంచీ 50 వేల మందిని, మిగిలిన సెగ్మెంట్ల నుంచీ 15 వేల మంది చొప్పున తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు.

**● ఉదయం 9 గంటలకే చేరుకోవాలి!**

చంద్రబాబు పర్యటన, బహిరంగసభలకు హాజరయ్యే పార్టీ శ్రేణులు, ప్రజలు శుక్రవారం ఉదయం 9 గంటలకే వెంకటగిరి పట్టణం చేరుకోవాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన నిర్దేశిత సమయం కంటే గంట ముందుగా ప్రారంభమవుతుందని ఆయన గురువారం రాత్రి చెప్పారు. దీన్ని దృష్టిలో వుంచుకుని జిల్లావ్యాప్తంగా వెంకటగిరి తరలి రానున్న పార్టీ శ్రేణులు, ప్రజలు ఉదయం 9 గంటలకే సభాస్థలికి చేరుకోవాలని కోరారు.

# ఎన్నికల సందడి!

- ఉద్యోగుల్లో బదిలీల హడావిడి
- 23 నుంచి ప్రక్రియ ఆరంభం
- ఇప్పటికే అన్ని శాఖల్లో జాబితా సిద్ధం
- ఇంటింటా తిరుగుతున్న రాజకీయ నాయకులు
- అనుచరగణంతో ప్రచారాల జోరు


నెల్లూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు వీధి వీధిన రాజకీయ పార్టీల నాయకుల పర్యటనలు. మరోవైపు జిల్లా సరిహద్దులు దాటి వెళ్లడానికి సన్నద్ధం అవుతున్న ఉద్యోగులు. ఇలా జిల్లాలో ఎన్నికల సందడి అప్పుడే మొదలయ్యింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా రాజకీయ పార్టీల నాయకులు గడప గడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఆయా పార్టీల అధినేతలు అభ్యర్థుల పేర్లు అధికారికంగా ప్రకటించకున్నా, సిటింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కొత్తగా టికెట్టు ఆశిస్తున్న నాయకులు టికెట్ల కోసం ప్రయత్నిస్తూనే ప్రచారాన్ని మొదలు పెట్టేశారు. నాయకులు, వారి అనుచర గణాలతో ఊరూరా తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు ఒకరి తర్వాత ఒకరు గ్రామాల్లో, పట్టణాల్లో పర్యటిస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నాయకుల ప్రచార హోరుతో ప్రజలు సైతం ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు.

**● ఇక ఉద్యోగుల వంతు**

వారం రోజుల్లో జిల్లాను వీడే ఉద్యోగులు, కొత్తగా వచ్చే ఉద్యోగులతో సందడిగా మారనుంది. 22వ తేదీన ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ ఉంది. ఆ మరుసటి రోజు నుంచి జిల్లాలో ఎన్నికల బదిలీల జాతర జరగనుంది. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పక్క జిల్లాలకు బదిలీ కానున్నారు. ప్రధానంగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరికొందరికి స్థానచలనం ఉంటుంది. పోలీస్ శాఖలో ఎస్‌ఐ స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు జిల్లాను వీడనున్నారు. అలాగే సొంత జిల్లాకు చెందిన జిల్లాస్థాయి అధికారులు కూడా బదిలీ కానున్నారు. ఈ మేరకు బదిలీ అయ్యే ఉద్యోగ వర్గాల జాబితా సిద్ధం అయ్యింది. ఈ నెల 23వ తేది నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమై 31వ తేదీలోపు పూర్తి కానుంది.

# నేటి నుంచి కులగణన!

- సర్వేలో పాల్గొననున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది
- పది రోజులపాటు నిర్వహణ



నెల్లూరు (హరనాథపురం), జనవరి 18 : కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత, సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధిని తెలుసుకునేందుకు శుక్రవారం నుంచి జిల్లాలో కులగణన సర్వే జరగనుంది. వాస్తవానికి గతేడాది నవంబరు 27వ తేదీనే ఈ సర్వే జరగాల్సి ఉన్నా వాయిదా పడింది. అయితే, శుక్రవారం నుంచి పది రోజులపాటు జరిగే ఈ సర్వేలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొననున్నారు. ప్రజలు వీరికి ఎలాంటి కులధ్రువీకరణ పత్రాలు, చిరునామా కార్డు వంటివి చూపించాల్సిన అవసరం లేదు. సర్వేలో ఎనిమిదేళ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు మినహా కుటుంబసభ్యులందరికీ ఈకేవైసీ తప్పనిసరిగా ఉంటుంది. కుటుంబ సభ్యుడు మరణించినట్లు గుర్తిస్తే ఆ సభ్యులలో ఒకరికి ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకొంటారు. ఇంట్లో వారు చెప్పే సమచారాన్ని మాత్రమే వలంటీర్లు నమోదు చేసుకోవాలి. ఈ కులగణనకు సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు ప్రకటించినా కులగణనలో అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానం చెబితే తాము లబ్ధిపొందుతున్న పథకాలకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడుతాయేమోనని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**● సర్వే ఇలా..**

కులగణన సర్వేను పక్కాగా చేపట్టడానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసుకుంది. సర్వే చేస్తున్న సమయంలో కుటుంబంలోని సభ్యులు అందుబాటులో లేకపోతే వారి కోసం ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పించారు. ఐదు రోజుల్లోపు వారు సచివాలయానికి వచ్చి వివరాలు సమర్పించుకోవచ్చు. ఈ అవకాశం ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఉంటుంది. ప్రతి ఇంటి సర్వే ముగింపులో వలంటీరు, సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ తప్పనిసరిగా వేయాలి. ఈ కులగణనకు నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ వ్యవహరిస్తుండగా, మండల, సచివాలయాల స్థాయిలో ప్రత్యేకాధికారులను ఇప్పటికే నియమించారు.



నెల్లూరు ప్రధాన బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

# ప్రయాణికులను విస్మరించి.. ప్రభుత్వ సేవలో తరించి!

- విజయవాడకు 300లకుపైగా బస్సులు!
- పండుగ ముగించుకుని తిరుగు ప్రయాణంలో అవస్థలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) జనవరి 18 : బంధుమిత్రులతో సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకుని తిరుగు ప్రయాణమైన ప్రజలకు కష్టాలు వెంటాడుతున్నాయి. బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో పిల్లలతో కలిసి అవస్థలు పడుతున్నారు. ఓపిక నశించి విచారణ కేంద్రంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్నా 'వస్తాయి.. వచ్చేస్తాయి...' అనే సమాధానం తప్ప మరేం చెప్పడం లేదు. విజయవాడలో శుక్రవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనుంది. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమానికి ప్రజలను తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రీజియన్లలోని ఆర్టీసీ బస్సులను పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అధికారులకు అందాయి. ఈ మేరకు నెల్లూరు రీజియన్ నుంచి వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులను గురువారం విజయవాడకు పంపారు. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 630లకుపైగా ఆర్టీసీ బస్సులు ఉండగా, వాటిలో 112 బస్సులు విజయవాడకు పంపినట్లు ప్రజారవాణాశాఖ అధికారి పీవీ.శేషయ్య తెలిపారు. కాగా, నెల్లూరు-1, 2 డిపోల నుంచే 80లకుపైగా బస్సులు విజయవాడకు వెళ్లాయని, రీజియన్ వ్యాప్తంగా 300లకుపైగా బస్సులను పంపి ఉంటారని కొందరు ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు. కాగా, బస్సుల రద్దు విషయం అధికారులు ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే తమ ప్రయాణాలు రద్దు చేసుకోవడమో.. లేదా ప్రత్యామ్నాయం చూసుకోవడమో చేసేవారమంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## సీఎంను కలిసిన కందుకూరు ఎమ్మెల్యే

- మంచి నిర్ణయం తీసుకుంటా.. : జగన్
- ఏ నిర్ణయం తీసుకున్నా సమ్మతమే : మహీధరరెడ్డి

కందుకూరు, జనవరి 18: కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి గురువారం సాయంత్రం సీఎం జగన్‌ను కలిశారు. వైసీపీ అధిష్ఠానం పిలుపుతో మధ్యాహ్నం నుంచి బయలుదేరి వెళ్లిన మహీధరరెడ్డి సాయంత్రం సీఎంతో భేటీ అయ్యారు. అంతకుముందు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను పిలిపించి "మీకు ఈ విడత కనిగిరి టిక్కెట్ ఇవ్వలేను, కందుకూరు వెళ్తానంటే ఓకే చేస్తా"నని జగన్ చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే బుర్రా 'ఇస్తే కనిగిరి ఇవ్వండి లేకుంటే లేదు.. నేను కందుకూరు వెళ్లలే'నని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. బుర్రా వెళ్లిపోయాక ఎమ్మెల్యే మహీధరరెడ్డితో భేటీ అయిన జగన్ సూటిగా ఏమీ చెప్పనప్పటికీ సానుకూలంగా మాట్లాడినట్లు సమాచారం. 'కందుకూరులో అంతా ఓకే కదా.. మనవాళ్లంతా సిద్ధంగానే ఉన్నారా!? అక్కడ మంచి నిర్ణయం తీసుకుంటా. అభ్యర్థిని ఖరారుచేసేటప్పుడు మీతో మాట్లాడాకే చెస్తా'నని మహీధరరెడ్డితో చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎంపికలో పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలపై మీ అభిప్రాయం ఏమిటని జగన్ మహీధరరెడ్డిని అడిగినట్లు సమాచారం. దానికి పెద్దగా స్పందించని మహీధరరెడ్డి 'కందుకూరు విషయంలో అంతా బాగానే ఉంది.. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు ఓకే' అని సీఎంతో చెప్పి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లను విమర్శించాలని మహీధరరెడ్డికి పార్టీ షరతు పెట్టడం అందుకు ఆయన ససేమిరా అనటంతో కందుకూరులో బీసీ అభ్యర్థిని బరిలోకి దించబోతున్నట్లు పలుపేర్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎంపీగా పోటీచేయనున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కందుకూరులో మహీధరరెడ్డికే టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతుండటమే గాక మరికొందరు ముఖ్య నేతలు కూడా అయిష్టత వ్యక్తం చేసినట్లు తెలిసింది.వ దీంతో మహీధరరెడ్డిని పిలిపించిన జగన్ మార్పు సంకేతాలు ఇవ్వకుండా మంచి నిర్ణయం తీసుకుంటానని మాట్లాడారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే మంచి నిర్ణయం అంటే ఏమిటన్న విషయంలో రకరకాల విశ్లేషణలు జరుగుతున్నాయి.

## త్వరగా బీఎల్వోలను నియమించుకోండి : కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం) : ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పక్షాలు బూత్ లెవల్ ఏజెంట్లను (బీఎల్ఏ) త్వరగా నియమించుకోవాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న ఓటర్ల తుదిజాబితా ప్రకటిస్తామని, ఫాం 7, 8లను ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు, ఫాం 6ను నామినేషన్ల చివరి రోజు వరకు ప్రాసెస్ చేయడం జరుగుతుందని చెప్పారు. 17వ తేదీ నాటికి జిల్లాలో 19, 07,908 మంది ఓటర్లు ఉండగా 9,34,631 మంది పురుషులు, 9,73,063 మంది మహిళలు, ఇతరులు 214 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న 2,317 పోలింగ్ స్టేషన్లకు 2,317 మంది బీఎల్వోలను, 232 మంది సూపర్వైజర్లను నియమించి నట్లు చెప్పారు.ఈ సమావేశంలో వైసీపీ నుంచి మురళీధర్రెడ్డి, టీడీపీ నుంచి సురేంద్రబాబు, రసూల్, బీజేపీ నుంచి బి.శ్రీనివాసులు, రాజేష్, బీఎస్పీ నుంచి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయ సాధనకు కలసి నడవాలి : మాలేపాటి

**కావలి, జనవరి 18:** ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కలసి నడవాలని టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఎన్టీ ఆర్ వర్ధంతిని గురువారం కావలిలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కా ర్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్, అన్నదాత మణి, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, బొట్లగుంట శ్రీహరి నాయుడు తది తరులు పాల్గొన్నారు.

**కావలి రూరల్ :** తుమ్మలపెంట సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాలేపాటి సుబ్బానాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాల వెంకట్రావు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, చెంచంగారి శ్రీనివాసులు, కోసూరి వెంకటేశ్వర్లు, వాయిల శ్రీనుబాబు, వాయిల శ్రీనివాసులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లూరు:** స్థానిక టీడీపీ నాయకులు గురువారం ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. బీద గిరిధర్ ఆధ్వర్యంలో పాత టీడీపీ కార్యాలయం వద్ద వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నా యకులు బండి శ్రీనివాసులు రెడ్డి, రామిశెట్టి కృష్ణచైతన్య, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, తోట శ్రీహరి, అరగల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లూరు:** ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని కందుకూరు ఇన్ చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అన్నా రు. గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు జనిగర్ల నాగరాజు, చెన్నారెడ్డి మహేష్, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, మేకపోతుల రాఘవయ్య, పువ్వాడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**లింగసముద్రం:** స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల గోపాలరావు, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, ఎన్ నారాయణ, ఏ. చిన సత్యం, గొల్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదపవనిలో జరిగిన వేడుకల్లో నాయకులు వేముల గోపాలరావు, మాజీ ఎంపీపీ జీ కల్పన, జీ సాంబయ్య, డాక్టర్ జి నరసింగరావు, చినపవనిలో నాయకులు మోతుకూరి పర్వతాలు, సోంపల్లి మనోహర్, పీ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం:** స్థానిక టీడీపీఈ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, పరిటాల భాస్కర్‌రావు, గురిజాల బెంజిమెన్, గుత్తా కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పోకూరు, వలేటివారిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పోకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ఇంటూరి రాజేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో గురువారం రాత్రి టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పెట్టారు. కార్యక్రమంలో ఘట్టమనేని చెంచురామయ్య, వీరమోసు అంజయ్య, కాకుమాను హర్షకుమార్, గుత్తా నాగమోహన్, గుత్తా మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

**జలదంకి:** స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్‌కు ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పీ మధుమోహన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, మందపల్లి మాల్యాద్రియాదవ్, పచ్చా పెంచలయ్యనాయుడు, ఏగూరి రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యేగా బొల్లినేని వెంకటరామారావును గెలిపించుకోవాలని నేతలు ప్రతిన బూనారు.

**ఉలవపాడు:** ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా జరిగాయి. కరేడు, ఉలవపాడు, చాగొల్లు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ పాల్గొన్నారు. కరేడు, చాగొల్లు గ్రామాల్లో అన్నదానం చేశారు. టీడీపీ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించి, అవసరమైన వారికి నెలకు మందులు అందచేశారు.

**కొండాపురం:** ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు గురువారం జనసేన నాయకులతో కలసి ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ ఎం ఓంకారం అధ్వర్యంలో ఆదిమూర్తిపురం, సాయిపేట గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, సీహెచ్.వెంకటాద్రి, కుంకు మోహనరావు, చాగంటి క్రిష్ణ, వల్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే బొల్లినేని వ్యతిరేక వర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, బొట్లగుంట హరిబాబు, గంటా నరసింహులు, జాగర్లమూడి శ్రీను కొమ్మి ప్రభాకర్, పోలినేని చంద్రబాబునాయుడు తదితరులు ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాగా ఇస్కపాలెంలో టీడీపీ నాయకుడు దామా శివబాబు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

**కందుకూరు:** ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించటంతోపాటు అన్నదానం చేశారు. తొలుత ఏరియా ఆసుపత్రి సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెంగమాంబ ఫంక్షన్‌హాలుకు చేరుకుని సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ముందుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సభలో ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, చిలకపాటి మధు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, కంద్రా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు పాల్గొన్నారు. వెంకటాద్రి పాలెంలో ఏర్పాటుచేసిన వర్ధంతిలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, ఉన్నం నళినీదేవిలు పాల్గొని ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. వెంకటాద్రిపాలెంలో జరిగిన వేడుకల్లో ఇంటూరి నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

**దగదర్తి (బిట్రగుంట) :** సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని జిల్లా టీడీపీ నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు అన్నారు. దగదర్తి మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. యువనాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు ఆధ్వర్యంలో యువత, మహిళలు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. అనంతరం పేద గిరిజనులకు మాలేపాటి సుధాకర్, కుటుంబ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంచర్ల రాధయ్య, వెంకటకృష్ణ, జలదంకి.శ్రీహరి, వడ్డె వినయ్, మువ్వలసురేష్, పెవళ్ళి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**బిట్రగుంట:** బోగోలు టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు వేంకటేశ్వర్లురెడ్డి, సుధీర్‌బాబు, రఘురాంనాయుడు, మాధవరావు, అంజయ్యయాదవ్, సుబ్బారావు ఉన్నారు.

**కలిగిరి:** స్థానిక టీడీపీ కార్యా లయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడు కలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో బిజ్జం కృష్ణారెడ్డి, ఊసా మాల్యాద్రి, కాకు మహేష్ స్వర్ణ కొండయ్య, నిశ్శంకర సురేష్, బండారు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. పెద్దపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి రైతు నాయకుడు బీవీరామారావు, మాజీ సర్పంచి మొక్కా హజరత్ బాబు, గంజాం రాఘవేంద్ర, గ్రామ స్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కావలి : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు



కందుకూరు : వెంకటాద్రిపాలెంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న పోతుల రామారావు, ఇంటూరి రాజేష్, కంచర్ల శ్రీకాంత్ తదితరులు




ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు



చేజర్ల : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కన్నబాబు తదితరులు

**ఆత్మకూరు:** ఆత్మకూరు మండల, మున్సిపాల్టీ పరిధిలో నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపాల్టీ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు, పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచల చౌదరి, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మద్దినేని నారాయణ, పయ్యావుల మారుతినాయుడు, పలు వురు టీడీపీ నేతలు, అభిమానులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి పల్లవోలు జయాకర్, ఎన్ఆర్‌ఐ మీరామోహిద్దీన్, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు బాలకృష్ణ, హజరత్‌బాబు, సుబ్బారెడ్డి, సంషీద్, రమణయ్య. పలువురు టీడీపీ నేతలు, అభిమానులు తదితరులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రా పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**సంగం:** సంగంలోని జాతీయ రహదారి కూడలి వద్ద ఎన్టీఆర్ జంక్షన్‌లో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జి శ్రీనివాసులు యాదవ్, బి శ్రీనివాసులురెడ్డి, కోటు కరుణాకర్‌రెడ్డి, కాకు వెంకటేశ్వర్లు యాదవ్, షేక్ బాబు, ఉక్కాల శ్రీనివాసులు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కె మంజుల నాయుడు, కొరిమెర్ల శ్రీనివాస్ చౌదరి, ఖాదర్ బాషా, ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అనంతసాగరం:** మండలంలోని సోమశిల, అనంతసాగరం, కమ్మవారిపల్లి, గౌరవరం గ్రామాల్లో గురువారం దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సద్దా రవీంద్రారెడ్డి, నాయకులు చల్లా నర్సారెడ్డి, చల్లా శివారెడ్డి, గూడూరు శ్రీకాంత్‌రెడ్డి, చంద్ర రాజయ్య నాయుడు, కాసా సుబ్బారెడ్డి, పెద్ద సూరారెడ్డి, శాఖమూరి వెంకటేశ్వర్లనాయుడు, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, శాఖమూరి రవి, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

**మర్రిపాడు :** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం తిక్కవరం, కంద్రిక గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. మండల కేంద్రంలో యువత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, వెంకటేశ్వర్లు, చంద్రబాబు, శ్రీనివాసులు, రవి, సుబ్బారావు, నాగేశ్వరావు, వెంకట్ చౌదరి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

**చేజర్ల:** చేజర్ల మండలంలో గురువారం దివంగత ఎన్‌టీఆర్ వర్ధంతి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చేజర్లలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావి పెంచలరెడ్డి, మాజీ సర్పంచ్ రావి లక్ష్మీనరసారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సమీపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదానం, అన్నదానం నిర్వహించారు. నాగులవెల్లటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు కేశవచౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రకదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొట్టాలు



ఉలవపాడులో ఇంటూరి తదితరులు

గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో పెంచలనాయుడు, నారాయణరెడ్డి, బీసీ నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు, సుదీర్, సుందరయ్య, హజరత్, మస్తాన్ కృష్ణ, గోపి పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** దుత్తలూరు సెంటర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, నాయకులు మల్లంపాటి గురవయ్య నాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, కండ్లగుంట వెంకటరెడ్డి, గుండాల కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దయానందం పాల్గొన్నారు.

**సీతారామపురం:** మండల కేంద్రంలోని సీతారామపురం బస్టాండ్ సెంటర్ వద్ద గురువారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు బోగినేని కాశీరావు, టీడీపీ మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, సీతారామపురం గ్రామపంచాయతీ సర్పంచ్ భాగ్యకుమారి, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జాషువా, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పాలిశెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్ :** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నక్యాంటీన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాంటీన్ ప్రారంభించి 210 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వాహకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, గూడూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**వింజమూరు :** పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌ల ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావు, నాయకులు గూడా నర్సారెడ్డి, తిరుపతి ఆచారి మహేంద్ర, ఎరుకల నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఎమ్మెస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



### ముగిసిన సంగమేశ్వరుడి గిరి ప్రదక్షిణ

**సంగం, జనవరి 18:** సంగమేశ్వరుడి గిరి ప్రదక్షిణ గురువారం ముగిసింది. సంగం కొండ చుట్టూ ఉన్న కొరిమెర్ల, తలుపూరుపాడు, తరుణవాయి గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించి గురువారం సాయంత్రం సంగం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి చేర్చారు.

## సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల నిరసన

**కావలిటౌన్, జనవరి 18:** సమ్మెలో భాగంగా గురువారం ట్రంకు రోడ్డులో అంగన్‌వాడీలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమై ప్రదర్శనలో నాయకులు బ్రిడ్జి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం, గాంధీ విగ్రహాల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ కూడలి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. అనంతరం ముసునూరులోని ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు అంగన్‌వాడీలు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పసుపులేటి పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, రైతు నాయకులు రావి మాల్యాద్రి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రఘురావమ్మ, విజయలత, సుభాషిణ, వజ్రమ్మ, కళావతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గురువారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు ఆత్మకూరు నాగయ్య, కె డేవిడ్‌రాజు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** ప్రభుత్వం ఎన్నిరకాల బెదిరింపులకు గురిచేసినా సమ్మె ఆపే ప్రసక్తేలేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, రెహనాబేగం పేర్కొన్నారు. గురువారం ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సీడీపీవో పచ్చవ లావణ్యకు సంజాయిషీ నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్యఅంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మస్తానమ్మ, కొండమ్మ, ప్రమీల, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కావలిలో అంగన్‌వాడీల ప్రదర్శన

### ఫ్లెక్సీ చింపివేత




చిరిగిపోయిన ఫ్లెక్సీ

**ఉలవపాడు, జనవరి 18 :** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. ఈ సంఘటన మండలంలోని కరేడులో బుధవారం రాత్రి జరిగింది. టీడీపీ శ్రేణుల కథనం మేరకు, ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి ఏర్పాట్లు చేసుకుంటూ కూతవేటు దూరంలో ఉన్న మార్కెట్ ఏరియాలో ఎన్టీఆర్ ఫ్లెక్సీ కట్టారు. తెల్లవారేసరికి ఫ్లెక్సీ చిరిగిపోయుంది. కావాలనే కొందరు గ్రామంలో గొడవలు సృష్టించడానికి ఇలాంటి కవ్వింపు చర్యలకు దిగారని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వారిని శాంతింప చేశారు. మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

### యువతే జాతీయ సంపద

**కావలి, జనవరి 18:** దేశ యువతే జాతీయ సంపదని రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో గురువారం జాతీయ యువజన వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనించేలా విద్యా విధా నాలు ఉండాలన్నారు. అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఈ వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ కావలిశాఖ చైర్మన్ రవిప్రకాష్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా రాష్ట్రస్థాయి అవార్డు పొందిన సాయితేజ్‌ను, కలిగిరి మండల రెడ్‌క్రాస్ చైర్మన్ ఆవుల శ్రీనివాసులరెడ్డిని, టీమ్ సేవియర్స్ ప్రణీత్, రమణ సుందరలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు దామిశెట్టి సుధీర్ నాయుడు, గ్రంధం ప్రస న్నాంజనేయులు, కలికి శ్రీహరి రెడ్డి, హరినారపరెడ్డి, డాక్టర్ రేవంత్‌కుమార్, మంగళగిరి వేణు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

**జలదంకి, జనవరి 18:** టీడీపీ కార్యకర్తల సంక్షేమనిధి నుంచి రోడ్డుప్రమాదంలో మృతిచెందిన జలదంకి మండలం కమ్మవారిపాలెంకు చెందిన మహిళా కార్యకర్త కమ్మ విజయమ్మ కుటుంబానికి రూ.2లక్షలను యువ నాయకులు నారా లోకేష్ మంజూరు చేశారు. ఈ మేరకు చెక్కును గురువారం వరికుంటపాడులో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతిలో విజయమ్మ భర్త మాల్యాద్రినాయుడుకి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉన్నం రవినాయుడు, పచ్చా పెంచలయ్యనాయుడు, మందపల్లి మాల్యాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వెండి కిరీట దాతకు సన్మానం

**కావలి రూరల్, జనవరి 18:** మండలంలోని తుమ్మలపెంట షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ఆలయ ట్రస్ట్ చైర్మన్ అళహరి చిట్టిబాబు ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వెండి కిరీటం బహూకరించిన ప్రవాసభారతీయురాలు పాలడుగు ఝాన్సీలక్ష్మీరాజ్యంను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పాలడుగు వెంకటరత్నంనాయుడు, అళహరి గోపిక్రిష్ణ, చలిదీంద్రం వెంకటప్రసాద్, అళహరి క్రిష్ణ పాల్గొన్నారు.

### పిచ్చి మొక్కల తొలగింపు

**సంగం, జనవరి 18:** స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను గురువారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించి శుభ్రంచేశారు. ఈనెల 2న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా జిల్లా కలెక్టర్ హరినారాయణన్ వైద్యశాల తనిఖీచేసి వైద్యశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన వైద్యాధికారి ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

### ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

**ఉదయగిరి రూరల్, జనవరి 18:** మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుడినరవ ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్, సహన ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఎం శివకల్పన, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు చెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, మెర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

### కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



విజేతలతో కాకర్ల సురేష్

**వింజమూరు, జనవరి 18:** వింజమూరు పంచాయతీలోని బొమ్మరాచెరువు కేంద్రంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని అన్ని మండలాలకు చెందిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించామని, వారిని ఎంపిక చేసి ఫైనల్‌గా మా కేంద్రంలో నిర్వహిస్తున్నామని, ఇక్కడ గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని, అలాగే పాల్గొన్న ప్రతి మహిళలకు బహుమతి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పాల్గొన్న వారికి భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### జగన్ దోపిడీని ప్రచారం చేయాలి : బొల్లినేని

**వరికుంటపాడు, జనవరి 18:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న దోపిడీ, అవినీతిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని మాజీ శాసనసభ్యుడు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. గురువారం స్థానిక జాతీయ రహదారి సమీపంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. అవినీతికి తావు లేకుండా పరిపాలన సాగించిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ అభివృద్ధికి సహకరించిన వ్యాపారవేత్తలు, ఎన్ఆర్ఐలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్వరరాపురం గ్రామానికి చెందిన వైసీపీ యువజన నాయకుడు పేరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కాంచెరువు, కనియంపాడు, తూర్పుబోయమడగల, కృష్ణంరాజుపల్లి, వరికుంటపాడు తదితర గ్రామాల నుంచి సైతం పార్టీలో చేరిన కార్యకర్తలకు బొల్లినేని పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంచలబాబుయాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, చంద్ర ఉమామహేశ్వరరావు, ముజ్జె లక్ష్మీనారాయణ, పోకా మహేష్, పోలిబోయినశ్రీకాంత్, చంద్ర వెంకయ్య, నూనె వేణి, పఠాన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

### తీరప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : బీఎమ్మార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

**బిట్రగుంట, జనవరి 18:** సమన్వయ లోపంతో తీరప్రాంతంలో చేయాల్సినంత అభివృద్ధి చేయలేక పోయామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండదని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో గురువారం గ్రామ సభ జరిగింది. అనంతరం వారు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెదకాపులు మాట్లాడుతూ పదేళ్లగా ఎమ్మెల్యే గ్రామాన్ని పట్టించుకోలేదన్నారు. అనంతరం గ్రామ సమస్యలపై వినతి పత్రాలు అందచేశారు. స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు తీరంలో అభివృద్ధి పనులు చేస్తామని కోదండరాముడి ఎదుట చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, మండల అధికారులు పాల్గొన్నారు.

● **శాంతించిన గంగపుత్రులు**

ఎమ్మెల్యే గ్రామంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని తాటిచెట్లపాలెం గ్రామస్థులు ఆగ్రహంతో ఉన్నారు. గ్రామకాపులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సభకు వచ్చేందుకు నిరాకరించారు. రాజ్యసభ సభ్యుడు బీద రాకతో వారు శాంతించారు. సభకు హాజరయ్యారు.

### బీటీఏ కార్యాలయం ప్రారంభం

**కందుకూరు, జనవరి 18:** బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) డివిజన్ కార్యాలయాన్ని గురువారం కందుకూరులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కందుకూరు, కావలి ఎంఈవోలు ఎంవీవీ ప్రసాద్, బండి గోవిందయ్య మాట్లాడుతూ బీటీఏ ఉపాధ్యాయులు ఎక్కువసేపు పాఠశాలలో పనిచేయటం ద్వారా మిగిలిన సంఘాల వారికి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీటీఏ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు మాట్లాడుతూ త్వరలో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు జరుపుకోనున్న బీటీఏను రాష్ట్రస్థాయిలో ఉన్నతసంఘంగా తీర్చిదిద్దటానికి సంఘంలోని ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాన ప్రసాదు, కళ్లగుంట మోహనరావు, సంగా మహేంద్ర, కట్టా రమేష్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



మోక్షయజ్ఞ మృతదేహం

**వలేటివారిపాలెం, జనవరి 18:** తినుబండారాలు కొనుక్కొని రహదారి పక్కన నడిచి వెళ్తున్న పదేళ్ల పాపను కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని అయ్యవారిపల్లెలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెంకు చెందిన హల్లు ప్రసాద్ కుమార్తె మోక్షయజ్ఞ (10) మృతి చెందింది. ఎస్ఐ బాలమహేంద్రనాయక్ కథనం మేరకు, మోక్షయజ్ఞ అయ్యవారిపల్లెలోని తన అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటోంది. అమ్మమ్మ ఇంటి పక్కన ఉన్న బంకులో తినుబండారాలు కొనుక్కొని రహదారి పక్కన వెళ్తున్న బాలికను పామూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో పాపకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ తన కారులోనే కందుకూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించాడు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. పాప తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు ఏసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

### గ్రావెల్ అక్రమ రవాణా అడ్డగింపు

**లింగసముద్రం, జనవరి 18:** మండలంలోని పెంట్రాల పంచాయతీలో గల గ్రేజింగ్ భూముల్లో గ్రావెల్ అక్రమ రవాణాను ఆ గ్రామ ఎస్సీ కాలనీ యువకులు అడ్డుకున్నారు.గురువారం ఉదయం నుంచి వాకమళ్లవారి పాలెంకి చెందిన కొందరు గ్రావెల్‌ను ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తున్నారని తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీలోని వైసీపీ, టీడీపీలకు చెందిన యువకులు జడ కుమార్, జడ కొండయ్య, ఓరుపల్లి మనోజ్, జె పవన్, మహేష్ తదితరులు వెళ్లి అడ్డుకున్నారు.తమ గ్రామ భూముల్లో గ్రావెల్ తవ్వి తరలించేందుకు ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. అనంతరం యువకులు లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాయానికి వెళ్లి గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో యుశేషబాబుకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అజయ్, ప్రవీణ్, సతీష్, జేమ్స్, వెంకట్రావు, పరంజ్యోతి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకుంటున్న ఎస్సీ కాలనీ యువకులు